# ముద్రా రాక్షసం

సంస్కృత మూలం

**విశాఖ దత్తుడు**

తెలుగు అనుకరణ

**మొదలి నాగభూషణ శర్మ**

# ఇందులో పాత్రలు

| | |
|---|---|
| సూత్రధారుడు | నటి |
| చాణక్యుడు | రాక్షసుడు |
| చంద్రగుప్తుడు | శార్ఙరవుడు |
| నిపుణకుడు | సిద్ధార్థకుడు |
| సమ్మిద్దార్థకుడు | వైహీనరి |
| భాగురాయణుడు | జీవిసిద్ధి |
| భాసురకుడు | శాణోత్తరుడు |
| మలయకేతువు | విదాధగుప్తుడు |
| చందనదాసు | శకటదాసు |
| జాజలి | కరభకుడు |
| ప్రియంవదుడు | చందన దాసు భార్య మాలిని |
| చందన దాసు కుమారుడు | (తెరలో) వైతాళికుడు |

## ముందు మాట

చంద్రగుప్తుణ్ణి మగధరాజ్య పట్టాభిషిక్తుణ్ణి చేసి తన పత్రిజ్ఞను నెరవేర్చుకొన్నాడు చాణక్యుడు.

అయినా అతడి మనోరథం పూర్తిగా నెరవేరలేదు. కుసుమ పురాన్ని శత్రువులు చుట్టిముట్టి ఉన్నారు. వారి బారినుంచి రాజ్యాన్ని రక్షించాలి.

ఇంతవరకు నందవంశ రాజులకు మహామంత్రి అయిన రాక్షసుణ్ణి చంద్రగుప్తునికి మంత్రిని చేయగలిగితేనే అది అసాధ్యం అని గ్రహించాడు చాణక్యుడు.

రాక్షసమంత్రిని శత్రుపక్షంనుంచి చంద్రగుప్తుని పక్షానికి రప్పించడం, అతడు మహామంత్రి పదవిని స్వీకరించేటట్లు చేయడం, అందుకు ఇరు పక్షాలు పన్నిన పన్నుగడలు – ఈ నాటక కథావస్తువు.

చాణక్యుని అసమాన ప్రతిభా విశేషాలు, రాక్షసమంత్రి నిస్వార్థ సేవా పరాయణత్వం ఈ నాటకంలో అడుగడుగునా మనకు ద్యోతకం అవుతాయి.

# ప్రస్తావన

**సూత్రధారుడు:**

ఒకసారి పార్వతీదేవి – “మీ నెత్తిమీదకెక్కి కూర్చున్న ఆ అదృష్టవంతురాలు ఎవరండీ?” – అని అడిగిందట శివుణ్ణి ఆయన – “శశికళ; నువ్వెరుగుదవే!” అని జవాబు చెప్పాడట! నేనడిగేది అక్కడ ఉన్న ఆడమనిషిని గురించండీ – అన్నదట పార్వతి. తక్షణం శివుడు తన జటాజూటంలో గంగాదేవిని దాచేసి “చంద్రుడని చెబితే నీకా మాత్రం నమ్మకం లేదా? అయితే నీ స్నేహితురాలు విజయ నీకు వివరంగా చెబుతుందిలే” అంటూ తన వాక్ చాతుర్యం చూపిన శివుడు ఈ ప్రేక్షకులను రక్షించుగాక.

అంతేకాదు.....

త్రిపురసుర సంహారం తరువాత – తన ఉదాత్త పదఘట్టనంతో భూమి కిందకు అణుచుకుని పోకుండా, దాని మీద తేలికగా అడుగు ఉంచి, తన ఉధృత కర విన్యాసంతో స్వర్గం పైకి లేచిపోకుండా చేతులు కుంచించి, ప్రళయం సంభవించకుండా తన ఫాలనేత్రాన్ని మూసి తాండవ నృత్యం చేసిన నటరాజు ఈ ప్రేక్షకుల్ని అహర్నిశం కాపాడుగాక....

ఇంకా కాలయాపనం దేనికి?....ఇప్పుడు విశాక దత్తుడు సంస్కృతంలో వ్రాసిన ముద్రారాక్షస నాటకాన్ని తెలుగు అనువాదాన్ని మీ ముందు ప్రదర్శించి కృతార్థులం అవుతాం....(లోపలకి చూచి) శ్రీమతీ....(ఇంకా గట్టిగా) ఏమోయ్......

**నటి** : వస్తున్నా....

**సూత్ర** : ఇంట్లో ఏదో హడావిగడిగా ఉందే! ఏమిటి వివేషం?

**నటి** : (వస్తూ) ఇదుగో! వచ్చేశాను....ఏమిటి శ్రీవారి ఆజ్ఞ?

**సూత్ర** : ఇల్లంతా సందడిగా వుండి –

**నటి** : ఆ! అతిధులు వచ్చి వున్నారు.

**సూత్ర** : ఎందుకు?

**నటి** : ఇవ్వాళ చంద్రగ్రహణం కదూ! అందుకని.

**సూత్ర** : ఇవ్వాళ చంద్రగ్రహణమా? ఎవరన్నారు?

**నటి** : ఊళ్ళో అందరూ అనుకుంటూ ఉంటేనే!

**సూత్ర** : జ్యోతిశ్శాస్త్రం 64 అంగాలను ఔపోసన పట్టిన వాణ్ణి, నాకా చెబుతావు? ఇవ్వాళ చంద్రగ్రహణం అని ఎవరో నిన్ను మోసపుచ్చారు? అసలు చంద్రగ్రహణం –

(తెరలో: “ఎవడురావాడు? నేనుండగానే – ”)

**నటి** : ఎవరండీ అది? అంతగట్టిగా అరుస్తున్నాడు! తాను భూమిమీదనే ఉండి, పైన చంద్రగ్రహణాన్ని ఆపేస్తా నన్నట్టు –?

**సూత్ర** : ఎవరబ్బా? తెలియడంలేదే?...అతడి చేత మళ్ళీ ఆ మాట అనిపిద్దాం, ఉండు. క్రూరుడయిన

కేతువు చంద్రుణ్ణి పట్టుకుంటేనే చంద్రగ్రహణం –

(మళ్ళీ తెరలో: "ఎవడురా వాడు? నేనుండగానే చంద్రగుప్తుణ్ణి పట్టదలచినవాడు?")

**సూత్ర** : ఆ! తెలిసింది.....ఆయన చాణక్యుడు...తన కోపాగ్నిలో నందవంశాన్ని భస్మీపటలం చేసిన కౌటిల్యుడు. (నటి భయాన్ని కనబరుస్తుంది) చంద్రగుప్తుణ్ని మగధ రాజ్యాన్ని పట్టాభిషిక్తుణ్ణి చేసినా ఇంకా అతన్ని చుట్టి ఉన్న శత్రువల బారినుండి రక్షించడానికి అప్రమత్తంగా ఉన్న చాణక్య మంత్రి...ఇప్పుడేదో ప్రమాదాన్ని శంకించకపోతే అంతటి కోపావిష్టుడు కాడు.

మనం చంద్రుడి గ్రహణం గురించి మాట్లాడుతూ వుంటే చంద్రగుప్తుణ్ణి ఎవరో పట్టుకోబోతున్నారని భ్రమించాడు...అడుగో! ఆయన ఇటే వస్తున్నాడు...మనం నిష్క్రమిద్దాం...పద....(ఇది ప్రస్తావన)

# మొదటి అంకం

(ముడి విడిపోయిన జుట్టును సవరించుకుంటూ చాణక్యుడు ప్రవేశిస్తాడు)

**చాణ** : ఎవడురా, నేనుండగానే చంద్రగుప్త గ్రహణం చేసేవాడు? ఆవులించిన సింహం నోట్లో కోరలు పెకిలొచే దెవ్వడు? నంద వంశాటవికి దావాగ్నిలా ప్రజ్వరిల్లిన నా కోపాగ్నిలో శలభంలా మాడిపోవడానికి ఉత్సహిస్తున్న దెవరు? నంద వంశ వినాశనానికి నల్లత్రాచై నిలిచిన ఈ నాశిఖను ఇప్పుడు కూడా ముడవనీయని వాడెవడు?

నందవంశం నిర్మూలమైనా, రాక్షసమంత్రి మాత్రం ఇంకా శత్రుపక్షంలోనే ఉండిపోయాడు. నంద వంశీయులు నిశ్శేషం అయితేగాని రాక్షసుడు మా పక్షానికి రాడని, అడవుల్లో తపస్సు చేసుకోవడానికి పోయిన సర్వార్థ సిద్ధిని చంపించాను....రాక్షసుడికి మరో గత్యంతరం ఉండదు. మా పక్షానికి రాక తప్పదు – అనుకుంటున్నాను. కాని ఇప్పుడు?

తన పినతండ్రి పర్వతకుడి హత్యకు కుపితుడైనా మలయకేతువును దగ్గరకు తీసి, నందరాజ్యాన్ని అతనికి పట్టం కడతానని ఆశపెట్టి, మ్లేచ్ఛ సైన్యాన్ని సమకూర్చుకొని, కుసుమ పురం మీదికి దండయాత్ర సన్నాహాలు చేస్తున్నాట్ట రాక్షసుడు!...ప్రతిన మేరకు నందవధ చేయగలిగిన నేను ఈ అవాంతరానికి ప్రతి క్రియ చేయలేనా?

ప్రతిన నెరవేర్చుకొని కూడా మౌర్యుడిమీద అనురాగం వల్ల మళ్ళీ శస్త్రం చేపట్టక తప్పడం లేదు...నిజమే! రాక్షసుడణ్ణి చంద్రగుప్తుడి సింహాసనం ఎక్కించి ప్రయోజనం ఏమిటి?

అహో! రాక్షసమంత్రీ! ఏమి స్వామి భక్తి నీది! రాజులు పదవిలో ఉండగా తాత్కాలిక లాభాల కోసం సేవించే వాళ్ళుంటారు. రాజులు కష్టాలలో ఉంటే తరువాత మంచి రోజులు వస్తాయని భావిలాభాలు చూసుకుని సేవించే వాళ్ళుంటారు. కాని, చనిపోయిన రాజుమీద చెరగని నీ భక్తి చూస్తే – నీ వంటి వాణ్ణి మా వృషలుడికి మంత్రిని చేయకపోతే ఎలా – అనే పట్టుదల పెరుగుతోంది, నాలో.....అందుకే ఈ నా సర్వప్రయత్నాలూ.

ప్రజ్ఞ ఏమీలేక కేవలం భక్తి మాత్రమే ఉన్న సేవకుడు నిష్ప్రయోజనం. భక్తి ఏమీలేక ప్రజ్ఞ మాత్రమే ఉన్న సేవకుడు ప్రమాదకరం. ఇహ ప్రజ్ఞ, భక్తులతో పాటు విశ్వాసం కూడా ఉన్న రాక్షసుణ్ణి పట్టితీరతాను... ........................

(చాణక్యుని ఇంటి వెలుపల, వీధిలో పాటవినవస్తుంది. యమపటంలో నిపుణకుడనే గూఢచారి పాడుకుంటూ వస్తాడు.)

**నిపుణకుడు:**

యమ దర్మరాజుకూ దండమెట్టండీ
ఇతర దేవ్వుకూ కొలిచే మి పలమండి ॥యమ॥
భక్తీ, ముక్తీ యముడే మాకు
అన్నం, పానం యముడే మాకు ॥యమ॥
రాజూ, పేదా భేదం లేక
ఒకటే దర్మం చూపే పెబువు ॥యమ॥
అందరి కతడు యముడై నిలుచు
మాకు మాత్రమూ సముడై నిలుచు ॥యమ॥

జాతకాలు చెబుతాం, మారకాలు చెబుతాం, గండాలు చెబుతాం........ఎవరయ్యో లోపల?

(అని లోనికి పోబోతాడు)

**శార్ఙ్ఞ్గ** : (వస్తూ) ఏయ్!...ఆగు .........ఆగు....సరాసరి లోపలికి వచ్చెయ్యడమే?

**నిపు** : ఏం? ఎవరిదయ్యా ఈ ఇల్లు?

**శార్ఙ్ఞ** : మా గురుదేవులు ఆర్య చాణక్యుల వారిది.

**నిపు** : అట్టనా! అయితే, ఈ యమధర్మరాజుగోరి పటం చూపి, మీ అయ్యోరికి కొన్ని దర్మాలు సెప్పాలె.

**శార్ఙ్ఞ** : ఆగు...మా గురువులవారికి తెలిసిన ధర్మాల కన్నా నీకెక్కువ తెలుసా?

**నిపు** : కోప్పడకు మరి....అందరికీ అన్నీ తెలుత్తాయా?...మీ గురువులకి కొన్ని తెలుసు..నాకు మరి కొన్ని తెలుసు....

**శార్ఙ్ఞ** : సర్వజ్ఞులైన అమాత్య చాణక్యులకు తెలియనివి నీకు తెలుస్తాయా?

**నిపు** : మీ గురువుగారు అంతోటి వారైతే, సెంద్రుడికి ఇరోదులెవరో సెప్పమను.

**శార్ఙ్ఞ** : సారి! ఇంతోటిది తెలిస్తేనేం? తెలియకపోతేనేం?

**నిపు** : ఆ! ఆ సంగతి మీ గురువుగారే తెలుసుకోవాలి...నీ వంటి వోడికి సెంద్రుడికి ఇరోది పద్మం అనే తెలుసు...కాని ఇంకా ఎవరెవరు ఇరోదులో తెలుసుకోవాలిగా!

**చాణ** : (లోపలినుంచి వస్తూ) ఆ! చంద్రగుప్తుడంటే ఇష్టంలేని జనాన్ని గురించి ఇతడు ప్రస్తావిస్తున్నాడు..

**శార్ఙ్ఞ** : పోవయ్యా! ఏమిటి అనవసర ప్రసంగం –

**నిపు** : అవసర ప్రసంగమేనయ్యా –

**శార్ఙ్ఞ** : ఎవరికి?

**నిపు** : తెలుసుకోదగిన వాళ్ళకి.....

**చాణ** : వినదలుచుకున్న వాళ్లు, తెలుసుకోదలిచిన వాళ్లు ఇక్కడ ఉన్నారు...శార్ఙ్ఞరవా! నీ పని చేసుకో –

**శార్ఙ్ఞ** : (నిపుణకుని వంక గుర్రుగా చూస్తూ) చిత్తం....(వెడతాడు)

**నిపు** : ఆర్య చాణక్యులకు జయం.

**చాణ** : చంద్రగుప్తుడు రాజ్యానికి రావడం గురించి జనం ఏమనుకుంటున్నారో తెలుసుకోమని పంపిన చారుడివి, నిపుణకుడివి కదూ! రా, కూర్చో –

నిపు : చిత్తం స్వామీ!

చాణ : ఆ! చెప్పు...ప్రజలంతా చంద్రగుప్తుడంటే అనురక్తులై ఉన్నారా?

నిపు : చిత్తం...ప్రజలు విరక్తులుగా ఉన్న కారణాలను తొలిగించాక మహారాజులంటే అనురక్తులు కాక అరెలా వుంటారు, గురుదేవా? కాని –

చాణ : కాని –

నిపు : ఈ నగరంలో ముగ్గురు వ్యక్తులు మాత్రం మొదటినుంచీ రాక్షసుడికి మిత్రులుగా వుండి, ఇప్పటికీ మహారాజు వారి ప్రగతిని సహించలేకపోతున్నారు.

చాణ : జీవితం మీద ఇచ్ఛ ఉండేనా? ఎవరు వాళ్ళు?

నిపు : మొదటివాడు జీవిసిద్ధి అనే జైన క్షపణకుడు. ఈయనే రాక్షసుడు ప్రయోగించిన విషకన్యను తమ దగ్గరకు తెచ్చినవాడు!

చాణ : (తనలో) నేను పంపిన ఇందుశర్మే జీవిసిద్ధి అని నా చారులకు కూడా తెలియదన్నమాట! బావుంది!! (బిగ్గరగా) సరే! రెండవవాడు?

నిపు : శకటదాసు అనే కరణం.

చాణ : (తనలో) సిద్ధార్థకుణ్ణి అతనితో స్నేహం చెయ్యమని పంపానుగా? (పైకి) ఆ! మూడవవాడు?

నిపు : మూడోవాడు అమాత్య రాక్షసుడికి ఆరోప్రాణం – చందన దాసు అనే రత్నాల వ్యాపారి. రాక్షసుడు రాజధాని వదిలి వెళ్ళేటప్పుడు తన భార్యాబిడ్డల్ని ఈయన ఇంట్లోనే విడిచివెళ్ళాడట!

చాణ : పరమ ఆప్తుడై ఉండాలి!....అతని ఇంట్లోనే తన స్వజనాన్ని విడిచి వెళ్ళాడని నీకెలా తెలుసు?

నిపు : ఆర్యా! ఈ ముద్రికను చూడండి..ఇదే మీకు సమస్తం చెప్పగలదు.

చాణ : (చూసి) ఇది రాక్షసుని ముద్రిక!...(సంతోషంతో) ఇక రాక్షసుడు మన చేతికి చిక్కాడన్నమాటే!..ఈ ముద్రిక నీకెట్లా దొరికింది?

నిపు : తమ ఆజ్ఞవర్తినై, ఈ యమపటం మిష కల్పించుకుని, ఇంటింటికీ పోయి విషయాలు సేకరిస్తూ చందనదాసు ఇంటికి కూడా పోయాను. నా పాట వినడానికి ఆ ఇంట్లోనుంచి ఏడేళ్ళ కుర్రాడు దూసుకువచ్చాడు. వెనకనే ఒకవిడ పరుగు పరుగున వచ్చి "వీథిలోకి వెళ్ళకూడదురా" అంటూ ఆ కుర్రవాణ్ణి అంది పుచ్చుకుని లోపలికి తీసుకుపోయింది. ఆ కుర్రవాణ్ణి అందుకోవడంలో ఆవిడ చేతిన ఉన్న ఈ ఉంగరం – వదులుగా ఉందేమో – ఊడిపోయి దొర్లుకుంటూ నా కాళ్ళ దగ్గరకు వచ్చి పడ్డది. చూద్దునుగదా, దాని మీద రాక్షసమంత్రి ముద్ర వుంది...దానిని తమ పాదాల దగ్గర వుంచడం కోసం భద్రంగా తెచ్చాను.

చాణ : సంతోషం!.....నీ శ్రమకు తగిన ఫలితం దొరుకుతుంది...ఇలానే ప్రతిరాత్రీ కనిపించు.

నిపు : చిత్తం......(నిష్క్రమిస్తాడు)

చాణ : (సంతోషంతో) శార్ఙరవా! మసిపాత్రా, పత్రమూ తీసుకుని రా.....రాసుకోవాలి.

శార్ఙ : (ఆ పరికరాలను తీసుకుని వస్తాడు. ఇంతలో వాకిట్లో అలికిడి అయితే బయటకు వెడతాడు)

చాణ : (తనలో) ఏం రాయను?..ఈ లేఖతోనే రాక్షసుణ్ణి జయించాలి...(వ్రాయడం మొదలుపెడతాడు)

(శోణోత్తరుడనే ప్రతీహారి వస్తాడు)

శోణో : జయం జయం ఆర్య చాణక్యులవారికి.

**చాణ** : జయ శబ్దంతో మొదలైంది నా ప్రయత్నం..బావుంది. ఏం శోణోత్తరా! ఏమిటి పని?

**శోణో** : చంద్రగుప్త ప్రభువులు మరణించిన పర్వతేశ్వరునికి పారలౌకిక క్రియలు చేయాలని సంకల్పించారు...తాము అనుమతిస్తే, పర్వతేశ్వరులు ధరించిన ఆభరణాలను తగినవారికి దానం చేయాలని భావిస్తున్నారు. ఆ విషయం మనవి చేయమన్నారు.

**చాణ** : చాలా చక్కని ఆలోచన...మా భావాలను అందిపుచ్చుకున్నారు ప్రభువులు...అయితే అవి అమూల్యమైన ఆభరణాలు. ఉత్తములకే దానం ఇవ్వాలి. అందువల్ల అటువంటి దాన స్వీకర్తలని మేం పరీక్షించి పంపుతామని ప్రభువులకు చెప్పు.

**శోణో** : చిత్తం గురుదేవా.

(వెడతాడు)

**చాణ** : (వ్రాయడం పూర్తిచేసి) శార్ఙరవా!..(తనలో) ఈ లేఖతో రాక్షసుణ్ణి జయించి –

**శార్ఙ** : (వస్తూ) గురదేవా!

**చాణ** : నువ్వు తక్షణం వెళ్ళి –

**శార్ఙ** : అయ్యా –

**చాణ** : విశ్వావసు సోదరుల్ని కలుసుకో. చంద్రగుప్తులవారు ఆభరణాలను దానం ఇవ్వబోతున్నారని, వాటిని తాము స్వీకరించాలని చెప్పు...స్వీకరించాక వచ్చి మాకు కనబడవలసిందని మనవి – అని కూడా చెప్పు.

**శార్ఙ** : అలాగే గురుదేవా! (వెళ్ళబోతాడు)

**చాణ** : ఆ! మరోపని కూడా చేసుకుని రా..ముందు సిద్ధార్ధకుణ్ణి కలుసుకో –

**శార్ఙ** : చిత్తం.

**చాణ** : చూడు....ఈ పత్రంలో నేనేదో రాశాను..కాని నా రాత బావుండదు..గొలుసు కట్టు రాత...శకటదాసు రాత ముత్యాల కోవలా ఉంటుంది. అందుకని నేను ఇక్కడ రాసి, కొట్టేసిన వృత్తాంతాన్ని శకటదాసు చేత రాయించి తీసుకు రమ్మన్నానని సిద్ధార్ధకుడితో చెప్పు.

**శార్ఙ** : చిత్తం.

**చాణ** : జాగ్రత్తగా విన్నావా?

**శార్ఙ** : చిత్తం, చిత్తం.

**చాణ** : ఇది ఎవరి కోసం రాయించారు అని ఎవరన్నా అడిగారనుకో! నీకు తెలియదుగా!..నువ్వెట్లా చెప్పగలవు?...ఆ! ఈ లేఖనీ, దీనితో పాటు చెప్పవలసిన కొంత సమాచారాన్ని సిద్ధార్ధకుడే తీసుకువెళ్ళాలనీ అతనితో చెప్పు.

**శార్ఙ** : చిత్తం...

(వెడుతూ ఉంటాడు)

**చాణ** : ఆ! మరోమాట!...ఇవి పూర్తయ్యాక, ఆ దారినే చందనదాసు ఇంటికి పోయి నేనొక మాటు రమ్మంటున్నాని చెప్పు...

**శార్ఙ** : అలాగే!

(వెడతాడు)

**చాణ** : ఈ వెర్రివాడు సిద్ధార్థకుడితో ఏం చెబుతాడో ఏమో? అయినా సిద్ధార్థకుడు అసలు విషయం గ్రహించగలడు కనక ఫరవాలేదు..అన్నీ అందరితో చెప్పడానికి వీలులేదు, కొందరితో ఏ కొంచెమో చెప్పకా తప్పదు.

చారులు తెచ్చిన వర్తమానాన్ని బట్టి రాక్షసుడితోను, మలయ కేతువుతోను చేతులు కలిపిన రాజులు అయిదుగురు: చిత్రవర్మ, సింహనాద, పుష్కరాక్ష, సింహసేన, మేఘకోశులు...ఎవరో అయిదుగురు రాజులనే రాశాను ఈ పత్రంలో. రాత శకటదాసుది అయి, ఆ రాజుల పేర్లు, వాళ్ళు కోరుకునే ప్రతిఫల విశేషాలు సిద్ధార్థకుడి చేత చెప్పిస్తే – ఇహ వాళ్ళ అయిదుగుర్ని రక్షించడం చిత్రగుప్తుడి తరం కూడా కాదు.

ఈ ఎత్తుతో మలయకేతువు రాక్షసుణ్ణి అనుమానించకా తప్పదు. ఆ అయిదుగురు రాజుల్ని నిర్జించకా తప్పదు..అప్పుడు...అప్పుడు రాక్షసుడు ఏకాకి కావడం, మన పక్షానికి రావడం – అవీ తప్పవు.

రాక్షసగ్రహణం.....ముద్రారాక్షసం

**సిద్ధా** : (ప్రవేశిస్తూ) గురుదేవులకు నమస్కారం.

**చాణ** : సిద్ధార్థకుడా?..కార్యం చక్క బరుచుకొని వచ్చావా?

**సిద్ధా** : చిత్తం. తమ సంకల్పానికి తిరుగు ఉంటుందా?.....శకటదాసు చేత నకలు రాయించి తెమ్మన్న పత్రం తెచ్చాను.

**చాణ** : చూశావా! శకటదాసు రాత ఎంత అందంగా ఉందో! సరే! ఈ ముద్రతో దానిమీద ముద్ర వెయ్యి.

**సిద్ధా** : (అలా చేస్తాడు)

**చాణ** : (ఆ పత్రాలు తీసుకుంటూ) సిద్ధార్థకా! నీ వల్ల మరో పని కూడా జరగవలసి ఉంది...ఇది ఆంతరంగికుడయిన వాడే చెయ్యాలి.

**సిద్ధా** : అంతకన్న అదృష్టం ఏమిటి గురుదేవా?...ఆజ్ఞాపించండి.

**చాణ** : ఒక గడియ దాటాక వధ్యస్థానికి వెళ్లు...అక్కడకు శకటదాసుని ఉరితీయడానికి తీసుకువస్తారు. అక్కడి తలారులకు ఎడమ కంటితో సౌంజ్ఞ చేయి. వాళ్ళతో పోట్లాడినట్టు కనిపించి, శకటదాసుని రక్షించి, హుటాహుటిన తీసుకుపోయి రాక్షసమంత్రికి వప్ప చెప్పు..తన ప్రాణమిత్రుడి ప్రాణాలు కాపాడినందుకు రాక్షసమంత్రి నీకు పారితోషికం ఇస్తాడు. స్వీకరించు...కొంతకాలం రాక్షసమంత్రి దగ్గరే విశ్వసనీయంగా ఉండు. ఆ తర్వాత....(దగ్గరకు పిలిచి, చెవిలో ఏదో చెప్పి) ఆ తర్వాత జరగవలసింది ఇదీ!

**సిద్ధా** : చిత్తం...తమ ఆజ్ఞ శిరోధార్యం....

(వెడతాడు)

**శార్ఙ** : (వస్తూ) గురుదేవా! విశ్వావసు సోదరులకు చెప్పివచ్చాను..సిద్ధార్థకుడికి మీరు ఇవ్వమన్న పత్రాలు ఇచ్చి వచ్చాను....చందనదాసుని తీసుకుని వచ్చాను...ఆయన వాకిట్లో వేచి ఉన్నాడు.

**చాణ** : భేష్!....శార్ఙరవా!...చూడు – మరో రెండు అత్యవసర వర్తమానాలు తీసుకువెళ్ళాలి. మొదటిది

– రాక్షసమంత్రి ప్రేరణతో విషకన్యను ప్రయోగించి పర్వతేశ్వరుణ్ణి చంపిన నేరానికి జీవిసిద్ధి అనే క్షపణకుణ్ణి నగరం నుంచి వెంటనే బహిష్కరించవలసిందిగా నగర రక్షణాధికారికి చెప్పు –

**శార్ఙ** : చిత్తం.

**చాణ** : ఇక రెండోది. శకటదాసు రాక్షస ప్రేరితుడై మాకు ద్రోహం చెయ్యడానికి పూనుకున్నట్లు దృఢమైన వర్తమానం అందింది. ఈ నేరానికి శకటదాసుని బహిరంగంగా ఉరివేయాలని చెప్పు.....అతని కుటుంబానికి యావజ్జీవ కారాగార శిక్ష విధించాలి – అని ప్రభువుల ఆజ్ఞగా చెప్పు....సరే! ఇప్పుడు చందనదాసుని ప్రవేశపెట్టు.

**శార్ఙ** : చిత్తం.

(వెడతాడు)

**చంద** : (వస్తూ, తనలో) నిర్దయుడైన చాణక్యుడు అకస్మాత్తుగా కబురు చేశాడంటే ఏ నేరం చెయ్యని వాళ్ళకి కూడా గుండె గుభేలుమంటుంది. ఇహ నా సంగతి చెప్పేదేముంటుంది?...అందుకే వచ్చేటప్పుడు ధనసేనాది వర్తక ప్రముఖులతో చెప్పేవచ్చాను – దుష్టుడైన చాణక్యుడు మన గృహాలను సోదా చేయిస్తాడు; రాక్షసమంత్రి కుటుంబాన్ని మాత్రం జాగ్రత్తగా కాపాడండి – అని.....ఇహ నాకేం జరిగినా నాకు లెక్కలేదు.

**శార్ఙ** : రండి శ్రేష్ఠిగారూ!

**చంద** : (ప్రవేశించి) ఆర్యులకు అభివాదాలు.

**చాణ** : ఆ! శ్రేష్ఠిగారూ! రండి, రండి.....ఆ ఆసనం మీద కూర్చోండి.

**చంద** : క్షమించండి. మీ ముందు అల్పులం..ఇక్కడ కూర్చుంటాను.

(అని కింద కూర్చోబోతాడు)

**చాణ** : అమ్మో! మీ వంటి సంపన్నులకు సరైన అతిధి మర్యాదలు చెయ్యకపోతే ఎలా? ఆ ఆసనం మీదనే కూర్చోండి.

**చంద** : తమ ఆజ్ఞ.

**చాణ** : మీ వ్యాపారం బాగా సాగుతోందా? లాభాలు బాగానే వస్తున్నట్లేనా?

**చంద** : తమ దయ వల్ల అంతా సలక్షణంగా సాగుతోంది ప్రభూ!

**చాణ** : చంద్రగుప్తుల వారి లోపాలు పూర్వపురాజుల మంచి గుణాలను ప్రజలకు జ్ఞాపకం చెయ్యడం లేదు కదా?

**చంద** : (చెవులు మూసుకుని) ఎంతమాట? ప్రభువుల పాలన శరత్కాలంలో వెన్నెలలా అందరికీ ఆనందాన్నిస్తున్నది.

**చాణ** : అయితే అందుకు ప్రతిఫలంగా ప్రభువులు బహుమానం కోరుకోవచ్చునేమో?

**చంద** : అంతకంటేనా? ప్రభువులవారికి ఏం కావాలి? ఎంత కావాలి?

**చాణ** : (నవ్వి) చందనదాసూ! ఇది చంద్రగుప్తుని రాజ్యం. నందుల రాజ్యం కాదు. నందులు ధనాశాపరులు కనుక, మీకూ వారికీ ధనసంబంధమైన లావాదేవీలు కద్దు..కాని, చంద్రగుప్తుల వారికి కావలసిందేమిటో తెలుసా? వారి ప్రజలు ప్రభువును కష్టపెట్టే పనులేవీ చెయ్యకపోవడమే!

**చంద** : ప్రభువుకు కష్టం కలిగించిన ఆ దురదృష్టవంతుడెవరు ప్రభూ!

చాణ : చందనదాసూ! ఆపు నీ వాక్చాతుర్యం. రాజద్రోహం చేస్తున్న వాళ్ళఓ ముఖ్యుడివి నువ్వే!

చంద : (చెవులు మూసుకుని) శివ శివా!...గరికపోచకు దావాగ్నితో వైరమా ప్రభూ?

చాణ : రాజద్రోహి రాక్షసుడి కుటుంబానికి నువ్వు ఆశ్రయం ఇచ్చావా? లేదా?

చంద : ఇదంతా కిట్టని వాళ్ళెవరో చేసిన అభూత కల్పన అమాత్య!

చాణ : చందనదాసూ! ఇందులో భయపడవలసిందేమీ లేదు. రాజ్య విగతులైన వారు రాజ్యంనుంచి పారిపోతూ తమ పరిజనాన్ని – అవతలి వారికి ఇష్టం ఉన్నా లేకపోయినా – పరుల ఇళ్ళలో వదిలిపోవడం సహజమే! ఎటొచ్చీ – వారిని దాచివుంచడం మాత్రం నేరం.

చంద : నిజంగా అంతే జరిగింది ప్రభూ! ఒకప్పుడు రాక్షసుల వారి గృహజనం మా ఇంట్లో ఉన్నమాట నిజం

చాణ : ఇందాక సర్వమూ అబద్ధం అన్నావు..ఇప్పుడు కొంత నిజం అంటున్నావు! నీ రెండు మాటల్లోనూ ఎంతటి వైరుధ్యమో చూశావా?

చంద : అది కేవలం అపోహ –

చాణ : (కోపంగా) చంద్రగుప్తుల రాజ్యంలో అపోహలకు తావులేదు..ఆ మాటల్నీ కట్టిపెట్టి, రాక్షస కుటుంబాన్ని మాకు అప్ప చెప్పు.

చంద : ఆర్యా! ఒకప్పుడు వారు మా ఇంట్లో ఉన్నమాట నిజం. ఇప్పుడు లేని మాటా నిజం.

చాణ : అయితే, వాళ్ళెక్కడ ఉన్నారిప్పుడు?

చంద : నాకు తెలియదు.

చాణ : తెలియదూ?..వెర్రి చందనదాసూ!...ఈ విష్ణుగుప్తుడు నందుల్ని పరిమార్చినట్లు, రాక్షసుడు చంద్రగుప్తుణ్ణి పరిమారుస్తాడని కలలో కూడా ఊహించకు.

(నేపథ్యంలో కలకలం)

చాణ : శార్ఙ్గరవా! ఆ కోలాహలం ఏమిటో చూడు.

శార్ఙ : (వాకిట్లోకి వెళ్ళి, చూచి వచ్చి) రాజద్రోహి అయిన జీవిసిద్ధి అనే జైనసన్యాసిని నగరంనుంచి తరిమి కొడుతున్నారు గురుదేవా!

చాణ : చూశావా చందనదాసూ! రాజద్రోహానికి ఎంతటి శిక్షో!...స్నేహితుడిగా చెబుతున్నాను. రాక్షస కుటుంబాన్ని అప్పచెప్పి అనుగ్రహం సంపాదించుకో.

(మళ్ళీ కలకలం)

శార్ఙ్గరవా! మళ్ళీ ఏమిటా కలకలం?

శార్ఙ : (వెళ్ళి వచ్చి) రాజద్రోహ నేరానికి శకటదాసుని ఉరితీయడానికి తీసుకువెడుతున్నారు.

చాణ : చూడు, చందనదాసూ! రాజద్రోహాన్ని మహారాజు క్షమించరు. రాక్షసుడి కుటుంబాన్ని అప్పచెప్పి, నీ కుటుంబాన్ని రక్షించుకో.

చంద : ఎందుకింకా భయపెడతారు? రాక్షసుని పరిజనం మా ఇంట్లో ఉన్నా మీకు అప్పగించనే, లేనివాళ్ళను మీకెలా అప్పగిస్తాను?

చాణ : అంతేనా?

చంద : ముమ్మాటికీ.

చాణ : (తనలో) ఆహా! స్నేహితుని కోసం ఆత్మత్యాగానికి కూడా సిద్ధపడ్డావు! నువ్వూ నిజమైన స్నేహితుడి వంటే! (పైకి, కోపంగా) దుర్మార్గుడా! అయితే రాజాగ్రహాన్ని చవిచూడు.

చంద : సిద్ధంగా ఉన్నాను. మీ ఇష్టం వచ్చిన శిక్ష విధించండి.

చాణ : శార్ఙ్గరవా! రాజద్రోహి అయిన ఈ వర్తకుణ్ణి బంధించమని నా మాటగా రక్షణాధికారికి చెప్పు…ఆగు.. సర్వ రక్షణాధికారి విజయపాలకుడితో ఇతణ్ణి సపుత్ర కళత్రంగా బంధించి, ఇతని యావదాస్థినీ స్వాధీనం చేసుకోమని చెప్పు. నేనీలోగా మహారాజుతో సంప్రదిస్తాను..మహారాజే ఇతనికి మరణశిక్ష విధిస్తాడు…

చంద : మీ ఇష్టం…మిత్రుడి కోసం ప్రాణాలర్పించడం కంటె సుకృతం ఏమిటి?

చాణ : (నవ్వుతూ) ఇక రాక్షసుడు నా చేతికి చిక్కినట్టే! అటు – సిద్ధార్ధకుడి ద్వారా నేను పంపిన లేఖవల్ల మలయకేతువుతో విరోధం. ఇటు – ఆప్తమిత్రుడికి ప్రాణసంకటం…ఇటు వంటి స్నేహితుణ్ణి ఉపేక్షించేటంత కృతఘ్నుడు కాడు రాక్షసుడు..చందనదాసును రక్షించడానికి తప్పక వస్తాడు.

(నేపధ్యంలో కలకలం)

శార్ఙ : (పరిగెత్తుకుంటూ వచ్చి) ఆర్యా! శకటదాసుని సిద్ధార్ధకుడు వధ్యస్థలం నుంచి తప్పించుకొని తీసుకుపోయాడని వార్త వచ్చింది.

చాణ : సాధు, సిద్ధార్ధకా, సాధు! కార్యారంభం నిర్విఘ్నంగా జరిపించావు! (పైకి) ఏమిటీ! ఇద్దరూ పారిపోయారా?..వారిని తక్షణం పట్టుకోవలసిందిగా భాగురాయణునితో చెప్పు.

శార్ఙ : (వెళ్ళి, మళ్ళీ పరిగెత్తుకుంటూవచ్చి) భాగురాయణుడు కూడా పారిపోయాడట గురుదేవా!

చాణ : (లోపల, సంతోషంగా) మంచివార్త. (పైకి, కోపంగా) ఆ! భద్రభట, పురుషదత్తా, డింగిరారిత, రోహితాక్ష, విజయవర్మలతో వారిని తరిమి తరిమి బంధించవలసిందిగా చెప్పు.

శార్ఙ : చిత్తం. (మళ్ళీ వస్తూ, ఆదుర్దాగా) ఆచార్య! ఘోరం జరిగిపోయింది. వాళ్ళందరూ రాత్రికి రాత్రే పారిపోయారట!

చాణ : వత్సా! విచారిస్తున్నావా?..వాళ్ళందర్నీ పట్టుకోవడానికి నేను లేనూ? (నవ్వి) అమాత్య రాక్షసా! ఇహ నువ్వెలా తప్పించుకోగలవో నేను చూస్తాను.

# రెండో అంకం

(విరాధ గుప్తుడనే చారుడు జీర్ణవిషుడనే పాములవాడి వేషంలో వస్తాడు)

పాములోన్ని బాబూ......నే పాములోన్ని బాబూ
ఇసంపాముల కోరలు ఉంచే ఆటలెన్నో ఆడించేటోడిని ॥పాము॥
తాచు, జెర్రి, పసరిక, ఉసిరిక
కట్టపాములూ కొండతాచులూ
నాగుపాములూ రత్తపింజరులు
ఇసంపాములను ఇట్టే బట్టి
బుట్టలో బెట్టి ఆటలెనోన ఆడించేటోడిని ॥పాము॥

చాలా ఇసయాల్లో పాములోల్లకీ, రాజుల్ని సేయించే టోల్లకీ కత్తుకలు త్తదండీ! పాములోడేమో పాముల మంతరాలు తెల్సుకుని రయస్యంగా ఉంచుకోవాల....పాములు కాటేస్తే మందు మాకు తెలుసుకునుండాల..రాజుల్ని సేయించేటోల్లుకూడా ఆలోచనల్ని రయస్యంగా ఉంచుకోవాల..అయనోరెవరో కానోరెవరో తెలుసుకునుండాల......

రాజుల్ని సేయించడం సరపాలని సేయించడం ఒకటే గదూ!...అనుకూలమైతే అంతా లాభమే!..బెడిసి కొట్టిందా – అమ్మోసి..లాబం గూబల్లోకొస్తది....పానం ఉరికంబం ఎక్కుద్ది....

(ఎవరో మాట్లాడుతుంటే విన్నట్టు నటిస్తూ)

ఏంది, సాములూ? నేనెవర్నా?..కనిపించడంలే?...పాములోన్ని...నన్ను జీర్ణఇసుడూ అంటారు. (మళ్ళీ విని) ఏందీ?...పాముల్ని ఆడించమంటారా? మీ ఉద్దోగం ఎక్కడ సాములూ?..ఆ! రాజుగారి కొలువులోనా? మరి రోజూ అక్కడ జూసేది పాముల్ని ఆడించడం గదూ?....అరె! ఆసామి ఎల్లిపోతుండే!......ఆ! మీరేమంటుండారు?.. బుట్టలో ఏమున్నాయనా?..పాములు సామీ! కోరలు తీయని పాములు...ఇక్కడాడించమంటారా? అమ్మో! ఇక్కడ గాదయ్యా!....అల్లదిగో ఆయింటికాడ బుట్ట ఇప్పుతా..అక్కడ సూద్దువుగాని, రా –

ఏంది?..అది మంతిరి రాచ్చసులోరి ఇల్లా?..ఆ నా అసుమంటోల్లని రానివ్వరా?..హహ...నా పనే నన్ను రానిస్తదయ్యా! ఈ వాకిలి దగ్గర కాపేసుకునుంటా –

(మరో ప్రక్కనుంచి రాక్షసుడు, సేవకుడు ప్రియంవదకుడు వస్తారు)

**రాక్ష** : ఒక అవాంతరం తరువాత మరో అవాంతరం.....చనిపోయిన మహారాజు కోసం ఎత్తులకు

పైఎత్తులు వేయక తప్పడం లేదు.....విధి ఎంత చంచలమైంది! నిన్నటివరకు నంద రాజ్య మహామాత్య పదవిలో అనన్య సామాన్యమైన గౌరవ మర్యాదలు, ఇవ్వాళ మలయకేతువు దగ్గర అజ్ఞాత వాసంలో –

కుసుమ పురంలో నా స్వజనాన్ని వదిలి వచ్చాను గనుక ఎప్పటికైనా మళ్ళీ ఆ నగరానికి నేను తిరిగివస్తానని నందవంశ విధేయులకు జ్ఞాపకం ఉంటుంది...తగినంత ధనం ఇచ్చి శకటదాసును కుసుమపురంలో ఉంచి చంద్రగుప్తుణ్ణి మట్టుపెట్టే పనులు అప్పగించాను. అన్ని విషయాలూ జాగ్రత్తగా కనిపెట్టి ఉంటూ ఎప్పటికప్పుడు నాకు వార్తలు చేరవేస్తూ ఉండమని జీవిసిద్ధివంటి మిత్రుల్ని పురమాయించాను.

(జాజలి అనే కంచుకి వస్తాడు)

**జాజ** : అమాత్య రాక్షసులకు జయం.

**రాక్ష** : రండి, జాజలీ!...కూర్చోండి..

**జాజ** : అమాత్యా! యువరాజు మలయకేతువు మీకో సందేశం పంపారు. మన దురదృష్టం కొద్దీ, నందవంశం అంతం అయిన నాటినుంచీ, మీరు సర్వమూ త్యజించారు...ఉచిత అలంకారాలు, సంస్కారాలు కూడా ధరించడం లేదు.

**రాక్ష** : జాజలీ! శత్రు సంహారం చేసి, కుమార మలయకేతువును సుగాంగ ప్రాసాదంలో స్వర్ణ సింహాసనం అధిష్టింప చేసేంత వరకు నాకు ఏ అలంకారాలూ వద్దు.

**జాజ** : మీ నేతృత్వంలో అది అసాధ్యమా అమాత్యా! అందుకే – మలయకేతు యువరాజు మీకీ ఆభరణం పంపారు. తాను ధరించే ఈ ఆభరణం పంపుతూ – "ఈ కానుకను స్వీకరించి, దీనిని ధరించవలసిందిగా అభ్యర్థించారు..ఆయన తొలిసారిగా పంపిన కానుక...పైగా స్వంత ఆభరణం...కాదనకండి అమాత్యా!

**రాక్ష** : కుమారుని కోరిక కాదనలేను...సరే! మీ మాటే కానివ్వండి...

(అని ఆ ఆభరణాన్ని ధరిస్తాడు)

**జాజ** : శుభం భూయాత్.....ఇక నేను సెలవు తీసుకుంటాను (వెడతాడు)

**రాక్ష** : ప్రియంవదకా! నా కోసం ఎవరో ద్వారం దగ్గరే వేచి ఉన్నట్టుగా వుంది....చూడు.

**ప్రియం** : (ద్వారం దగ్గరకువచ్చి) ఎవరయ్యా నువ్వు?

**విరాధ** : కనపడ్డంలే!..పాములోన్ని..రాచ్చసుల య్యోరి ముందు పాములాడించాలనొచ్చా.

**ప్రియం** : ఆగు...అమాత్యుల వారికి చెప్పివస్తాను. (లోపలికి వచ్చి) అమాత్యా! ఎవరో పాముల వాడట....మీ ముందు పాములను ఆడిస్తాడట!

**రాక్ష** : ఎడమకన్ను అదురుతోంది..సర్పకేళీతో ప్రారంభమా నా ప్రయత్నాలు? ప్రియంవదకా! మాకు పాముల ఆట చూడాలని లేదు. అతనికేమైనా ఇచ్చి పంపించెయ్యి.

**ప్రియం** : (బయటకు వచ్చి) అయ్యగారికి మనసు బాగులేదు. నీ పాములాట చూడరట!

**విరాధ** : బాబ్బాబు!...నేను ఒట్టి పాములోడ్నే కాదు...నా బాసలో కయిత్తం కూడా కడతా! ఇదుగో! ఈ పత్తరం అయ్యోరికి చూపించిరా.

ప్రియం : (లోపలకు వచ్చి) అతను కవిత్వం కూడా రాస్తాడట! ఈ పత్రం చూడమన్నాడు...

**రాక్ష** : (పత్రం చదువుతాడు)

తుమ్మెద తుమ్మెద తుమ్మెదా
కుసుమాలలో తేనె తుమ్మెదా
నువ్వు దండిగతాగేసి తుమ్మెదా
ఎవ్వరికి ఇస్తావు తుమ్మెదా
ఆ తేనె నెవ్వరికి ఇస్తావు తుమ్మెదా॥

(తనలో) ఓహో! కుసుమపురంలో విషయాలన్నింటినీ గ్రహించి రమ్మని పంపిన చారుడు విరాధగుప్తుడై ఉండాలి... ప్రియంవదకా! పోనీ ఆకలి పాటల్ని కాసేపు వింటాను...లోపలికి రమ్మను.

**ప్రియం :** రావయ్యా! రాక్షసుల సెలవయ్యింది.

(ప్రియంవదకుడితో పాటు విరాధగుప్తుడు లోపలకు వస్తాడు)

**విదాధ :** దండాలు దొరా!

**రాక్ష :** (స్వీకరించి) ఆ! ప్రియంవదకా! సేవకులతో పనిలేదు. వారిని వెళ్ళిపొమ్మని చెప్పు.....నువ్వు కూడా ఇంకా ఏదయినా పని వుంటే చూసుకో..ఈ కవిత్వం కొంచెం సేపు వింటాను.

ప్రియం : చిత్తం.

(వెడతాడు)

**రాక్ష :** విరాధగుప్తా! కూర్చో! కుసుమపుర విశేషాలేమిటి?

**విరాధ :** చాలా వున్నాయి అమాత్యా! ఎక్కడనుంచి మొదలుపెట్ట మంటారు?

**రాక్ష :** చంద్రగుప్తుడు రాజ్యానికి వచ్చిన రోజునుంచి చెప్పు...నేను నియమించిన చారులందరూ ఏం చేశారో చెప్పు.

**విరాధ :** చాణక్యుని ఆజ్ఞమేరకు, చంద్రగుప్త పర్వతేశ్వర సైన్యాలన్నీ మహాసముద్రం కుసుమపురం చుట్టూ మొహరించి ఉన్నాయి ప్రభూ – ఆ నగరాన్ని పట్టుకోవడానికి.

**రాక్ష :** (కోపంతో ఒరనుంచి కత్తిని లాగి) ఎవడురా వాడు? నేనుండగానే కుసువపురాన్ని ముట్టడించేవాడు? ప్రవీరకా! తక్షణం వెళ్ళి ప్రాకారం చుట్టూ మన సైన్యాన్ని నిలపండి. గజసేనను రక్షణగా నిలపండి..ప్రాణభయం వీడి శత్రువుల్ని చీల్చి చెండాడండి.

**విరాధ :** అమాత్యా! ఆవేశపడకండి...ఇప్పుడు నేను చెబుతున్నది గతంలో సంగతులు. వర్తమానం కాదు.

**రాక్ష :** (నిట్టూర్చి) అయ్యో! గతంలో విషయాలా?...ఊ! తరువాత?

**విరాధ :** సర్వార్థసిద్ధి మహారాజు అడవులకు వెళ్ళిపోయాడు. ఆయన పోవడంతో సైన్యంలో ధైర్యం సన్నగిలింది. నందుల రాజ్యాన్ని పున:ప్రతిష్ట చెయ్యాలన్న దీక్షతో మీరు కూడా నగరాన్ని వదిలిపెట్టారు....మీరు చంద్రగుప్తుణ్ణి చంపడానికి నియోగించిన విషకన్య చాణక్యుడి కపట నాటకం వల్ల పర్వతకుణ్ణి చంపింది.

**రాక్ష :** ఎంత దారుణం! విషకన్య ఒక్కరిని చంపడానికే నియోగించబడ్డది. అది చంద్రగుప్తుడు కాక, పర్వతకుడు కావడం మన దురదృష్టం...తరువాత?

**విరాధ :** తండ్రి దారుణహత్యతో బెంబేలు పడి మలయ కేతువుకూఆ పారిపోయాడు. కాని పర్వతకుడి తమ్ముడు విరోధకుణ్ణి మాత్రం – అర్ధరాజ్యం ఇస్తానన్న నెపంతో అక్కడనే ఉంచాడు చాణక్యుడు.

**రాక్ష** : అర్ధ రాజ్యం ఇస్తానన్నాడా చాణక్యుడు? ఇందులో ఏదో మోసం ఉండితీరాలి.

**విరాధ** : అవును ప్రభూ! చంద్రగుప్తుడు రాజప్రాసాదంలో ప్రవేశించడానికి అర్ధరాత్రి ముహూర్తం ప్రకటించాడు చాణక్యుడు. ఆ వేళకి సరిగ్గా అతని మీదపడి అతణ్ణి హతుణ్ణి చేయడానికి వీలుగా మీరు పంపిన దారుకుడు దారుతోరణాన్ని నిర్మించాడు. కాని, చాణక్యుడు ఇది గమనించి, విరోధకుడికి చంద్రగుప్తుడి వలెనే వేషభూషల్ని, ఆభరణాలను ధరింపచేసి, మహారాజు ఎక్కవలసిన ఏనుగుమీద అతణ్ణి ఎక్కించి, సకల రాజ మర్యాదలతో, చిహ్నాలతో రాజప్రసాద ప్రవేశం చేయించాడు. దారువర్మ అతడే చంద్రగుప్తుడని భావించి దారుతోరణాన్ని వదిలాడు. విరోధకుడు దానికింద పడి అక్కడికక్కడే మరణించాడు.

**రాక్ష** : దారుణం! మరి దారువర్మ, బర్బకుడు – మొదలైనవారు?

**విరో** : తాము చావక తప్పదని నిశ్చయించుకొన్న తోరణానికి ఉన్న ఇనపమేకుతో బర్బకుణ్ని చంపాడు. ఇదంతా చూచి జనం రాళ్ళు విసరడం మొదలుపెట్టారు...ఆ దెబ్బలకి దారువర్మ మరణించాడు.

**రాక్ష** : నాకు నమ్మకస్థులందరూ ఒకేసారి మరిణించారా? మరి మేము నియోగించిన వైద్యుడు అభయదత్తుడు?

**విరోధ** : అభయదత్తుడు పానీయంలో విషం కలిపాడని గుర్తించిన చాణక్యుడు అతని చేతనే ఆ పానీయాన్ని తాగించాడు.

**రాక్ష** : ఔరా! చాణక్యుని కుటిల కౌశలం! ఆ! మిగిలిన వాళ్ళు?

**విరాధ** : అందరికీ అదే గతి పట్టింది ప్రభూ! శయనా గారంలో మీరు నియోగించిన ప్రమోదకుడు, గోడల్లో దాక్కొని వున్న భీభత్సకుడు – అందరూ చాణక్యుని చాకచక్యానికి బలి అయిపోయారు.

**రాక్ష** : విరాధా! చంద్రగుప్తుణ్ణి వధించడానికి నేను నియోగించిన ప్రతి ఒక్కరూ అతడి విజయానికే ఎలా కారణం అయ్యారో చూశావా?

**విరాధ** : విధివిలాసం అలా వుంది ప్రభూ! మీరు కూడా అలా నిరుత్సాహ పడితే నంద మహారాజు మరణానికి పగతీర్చుకొనేదెవరు?

**రాక్ష** : నా ఆప్తమిత్రుల్ని గురించి నువ్వేమీ చెప్పలేదు...జీవిసిద్ధి –

**విరో** : విషకన్యను ప్రయోగించి పర్వతకుణ్ణి చంపడానికి కారకుడన్న నెపంతో జీవిసిద్ధిని అవమానించి నగరం నుంచి తరిమివేశారు.

**రాక్ష** : తన నేరాన్ని జీవిసిద్ధి మీదికి మళ్ళించాడన్న మాట చాణక్యుడు! మరి శకటదాసు –?

**విరాధ** : చంద్రగుప్తుణ్ణి చంపడానికి దారు వర్మ మొదలైన వాళ్ళను నియోగించింది శకటసేనని అతనికి ఉరిశిక్ష విధించారు.

**రాక్ష** : అయ్యో! శకటదాసునే!...ఎంతటి విశ్వాసపాత్రుడు!..రాజుగారి కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావుడు!...ఇంతమంది ఆత్మీయులు పోయినా, ఇంకా జీవచ్ఛవంగా నేను బ్రతికే వున్నాను చూడు!

**విరో** : అలా అనకండి అమాత్యా! మీరేలేకపోతే మా ప్రయత్నాలెందుకు? మమ్మల్ని నడిపించే నాయకుడెవరు?

**రాక్ష** : మరి, నా ఆప్త మిత్రుడు చందనదాసు?

విరా : మీ కుటుంబాన్ని అప్పగించలేదన్న కోపంతో చందనదాసును, అతని కుటుంబాన్ని కారాగృహంలో ఉంచి, అతిన యావదాస్థినీ ప్రభుత్వ కోశాగారినికి తరలించారు ఆయన్ని –

రాక్ష : అతన్ని కూడా ఉరి తీశారాయేం?

విరా : ఇంకా లేదు అమాత్యా! కాని ఇవ్వాళో రేపో అది జరిగి తీరుతుంది?

(ప్రియంవదుడు వస్తాడు)

ప్రియం : అమాత్యులకు జయం. శకటదాసు వచ్చి ద్వారం దగ్గర వేచి వున్నాడు ప్రభూ!

రాక్ష : (ఆనందంతో) శకటదాసా? నిజం?..ఇదెలా సాధ్యం?

విరా : విధి కరుణిస్తే అసాధ్యాలే సాధ్యాలు కాగలవు అమాత్యా!

రాక్ష : ప్రియంవదకా!..ఇంకా అక్కడే ఉన్నావేం? శకటదాసును వెంటనే ప్రవేశపెట్టు.

(శకటదాసు, సిద్ధార్ధకుడు వస్తారు)

శకట : జయం అమాత్యులవారికి.

రాక్ష : శకటదాసూ! నువ్వు క్షేమంగా తిరిగి రావడం కన్న మాకు విజయం ఏమిటి?...ఎంత ఆనందంగా ఉంది?....ఇదంతా ఎలా జరిగింది?

శకట : (సిద్ధార్ధకుడిని చూపుతూ) ఇతని వల్లనే ప్రభూ! ఇతను సిద్ధార్ధకుడు నాకు ఆప్తమిత్రుడు...ఈయనే, నన్ను వధించడానికి తీసుకుని వెడుతున్న తలారులతో తలబడి, తన ప్రాణాలొడ్డి, నన్ను కాపాడాడు.

రాక్ష : సిద్ధార్ధకా! నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదు.....ప్రస్తుతానికి మా సంతోషానికి గుర్తుగా ఈ ఆభరణాన్ని స్వీకరించు.

(తన మెడలోని హారం తీసి ఇస్తాడు)

సిద్ధా : అయ్యా! నేనీ ఊరికి కొత్త. ఇంతటి విలువైన హారం ఏంచేసుకోను? దీనిని మీరు బహుమానంగా ఇచ్చారు కనుక ప్రస్తుతానికి ఈ ముద్రికతో ముద్రవేసి మీ దగ్గరే ఉంచండి..అవసరం ఉన్నప్పుడు తీసుకుంటాను.

రాక్ష : శకటదాసూ! ముద్రవెయ్యి.

శకట : (ముద్రిక తీసుకుని చూసి) అమాత్యా! ఈ ముద్రిక మీద మీ పేరుందేమిటి?

రాక్ష : (తీసుకుని, చూసి) నిజమే! దీనిని, కుసుమపురంనుంచి వచ్చేటప్పుడు నా భార్య మాలినికి ఇచ్చాను.. ఇది నీకెక్కడిది సిద్ధార్ధకా?

సిద్ధా : కుసుమపురంలో ఒక ఇంటి ముందు దొరికింది అమాత్యా.

శకట : నీకు కావలసినంత ధనం ఇస్తారు. ఈ ముద్రికను తిరిగి రాక్షసులవారికి ఇచ్చి వెయ్యి సిద్ధార్ధకా!

సిద్ధా : ఎవరి ముద్ర వారి దగ్గర ఉండడమే న్యాయం కదా!....నాకూ అదే సమ్మతం, అమాత్యులు స్వీకరిస్తే–

రాక్ష : సరే! శకటదాసూ! ఆ ముద్రికను నీ దగ్గరే వుంచి వ్యవహారాలు నడుపుతూ వుండు.

సిద్ధా : అమాత్యా! నాదొక విన్నపం –

రాక్ష : ఏమిటిది? నిస్సంకోచంగా చెప్పు సిద్ధార్ధకా!

సిద్ధా : చంద్రగుప్తుడికి శత్రు పక్షాన పనిచేశాను కనుక, మళ్ళీ కుసుమపురం వెడితే నన్ను బ్రతకనివ్వరు.

అందువల్ల మీ దగ్గరనే, మీ సేవ చేసుకుంటూ, ఉండిపోవాలని –

**రాక్ష** : (నవ్వి) ఆ మాట మేమే అనవలసింది. అవస్యం, సిద్ధార్థకా! అలానే కానీ! శకటదాసూ! సిద్ధార్థకుడికి అవసరమైన వసతులు కల్పించు.

**శకట** : చిత్తం, అమాత్యా!

(ఇద్దరూ సెలవు తీసుకుని వెళ్ళిపోతారు)

**రాక్ష** : విరాధ! ఇంకా కుసుమపురం విశేషాలేమైనా ఉన్నాయా?

**విరా** : ఒక ముఖ్యమైన విషయం ప్రభూ!

**రాక్ష** : ఏమిటది?

**విరా** : మలయకేతువు పారిపోయిన నాటినుంచీ చంద్రగుప్త చాణక్యుడల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని ఊరంతా పుకారుగా ఉంది. మలయకేతువు పారిపోవడానికి చాణక్యుల ఉపేక్షే కారణమని చంద్రగుప్తుడు ఆగ్రహిస్తున్నాడట!

**రాక్ష** : భళీ! ఇది వరకు మరో శుభవార్త..విరాధా! నువ్వు ఇదే వేషంలో తిరిగి కుసుమపురం వెళ్ళు. అక్కడ చంద్రగుప్తుని కొలువులో స్తవకలశుడనే వైతాళికుడున్నాడు. చాణక్యునితో విరోధించినప్పుడల్లా చంద్రగుప్తుణ్ణి మెచ్చుకుంటూ ఆ భేదభావాన్ని ప్రజ్వలింప చెయ్యమని చెప్పు. కరభకుడి ద్వారా నాకు ఎప్పటికప్పుడు వర్తమానం పంపు.

**విరా** : చిత్తం, అమాత్యా! సెలవు.....

(వెళ్ళిపోతాడు)

**ప్రియం** : అమాత్యా! ఎవరో బేహారులు ఈ అమూల్యమైన ఆభరణాలు అమ్మకానికి తెచ్చారని, తమ సెలవైతే కొంటామని శకట దాసులవారు చెప్పమన్నారు.

**రాక్ష** : (వాటిని చూసి) చాలా అమూల్యమైని. సరసమైన ధరయిచ్చి వీటిని తీసుకోమను.

**ప్రియం** : చిత్తం......

(వెడతాడు)

**రాక్ష** : (తనలో) వెంటనే కరభకుణ్ణి కుసుమపురం పంపాలి. చంద్రగుప్తుణ్ణి చాణక్యుడి నుంచి విడదీయడం సాధ్యం?....ఎందుకు కాదు? విజయ గర్వంతో విర్రవీగే చాణక్యుడు చంద్రగుప్తుణ్ణి వెనకటిలానే చూస్తే అతడు సహించగలడా? చంద్రగుప్తుడు తన ఆజ్ఞలను ఉల్లంఘిస్తే చాణక్యుడు సహించగలడా? భేష్! ఇన్నాళ్ళకి రాక్షసమంత్రం ఫలించబోతోంది.

# విష్కంభం

(నటి ప్రవేశిస్తుంది)

**నటి** : ప్రస్తావన పూర్తి చేసి నాటకం మొదలు పెట్టించిన తరువాత సూత్రధారుడు, నటి నేపథ్యంలోనే ఉండిపోవడం, సంస్కృత నాటక రంగలక్షణం. అయినా వర్తమాన ప్రేక్షకుల దృష్ట్యా సూత్రధారులుంగారు వచ్చి కొన్ని విషయాలు వివరంగా చెప్పకపోతే నా వంటి సామాన్య ప్రేక్షకులకు కథ సరిగా అర్థం అయిచావదు. అందుకే, ధైర్యంగా – రంగస్థల మర్యాదకు విరుద్ధమయినా – ఆయన్ని పిలుస్తారు.

(పిలుస్తూ) ఆర్యా, ఆర్యా......

**సూత్ర** : ఏమిటీ రసభంగం? నాటకం మధ్యలో విష్కంభమూకాక, ప్రవేశకమూ కాక మధ్య నీ ఆటంకం ఏమిటి?

**నటి** : ఇది కూడా విష్కంభం లాంటిదేననుకోండి....కథ తెలుసుకోవడానికి కొంత అర్థం, తాత్పర్యం –

**సూత్ర** : ఏమిటో తొందరగా తేల్చు.

**నటి** : ఏమీ లేదు...చాణక్యుల వారు రాక్షసుణ్ణి చంద్రగుప్త మహారాజులకు మంత్రిని చెయ్యాలని సంకల్పించారు....అవునా?

**సూత్ర** : అవును.

**నటి** : కాని అది నమ్మబుద్ధి కావడం లేదు.

**సూత్ర** : ఎందుకని?

**నటి** : తాను మంత్రిగా ఉంటూ, తన స్థానంలో మరోమంత్రిని ఇన్ని కష్టాలుపడి తీసుకురావాలని ఆశించే మంత్రెవరండీ ఈ రోజుల్లో

**సూత్ర** : (నవ్వి) నువ్వు చెప్పింది ఈ రోజుల్లో నిజమే! కాని ఆ రోజుల్లో ఉత్తముణ్ణే మంత్రిగా తెచ్చుకోవాలన్న తపన ఉండేదన్నమాటేగా! అంతేకాదు....తమ శత్రువులకు మంత్రిగా ఉన్న రాక్షసుణ్ణి చంద్రగుప్తుడికి మంత్రిని చేయడానికి చాణక్యుడు ఎటువంటి వ్యూహాలు పన్నుతున్నాడో చూస్తే ఆ రోజుల్లో అధికారంలో ఉన్నవారి ఔన్నత్యాన్ని చూపుతోంది....ఇదేనా నీ సందేహం?

**నటి** : కాదు, కాదు.....చాణక్యుల వారేమో ఏమైనా సరే రాక్షసుణ్ణి మంత్రిగా తెస్తాను అని శపథం చేశారు. రాక్షసులవారేమో చాణక్యుల వారి రాజనీతిని జయించి మలయకేతువును రాజ్యానికి తెస్తాను అని ప్రతిజ్ఞ చేశారు......ఇద్దరూ మేధావులే కదా! వీరి ప్రతిజ్ఞలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి కదా! ఈ సమస్యకు పరిష్కారం ఏమిటీ – అని.

**సూత్ర** : పిచ్చిదానా! సంఘర్షణ పరాకాష్టకు చేరితేనే కాని సమస్యకు పరిష్కారం కుదరదు...అప్పటిదాకా లేచి వుందాం పద.

**నటి** : సరే, పదండి.

(ఇది విష్కంభం)

# మూడవ అంకం

(రాజప్రాసాదం ముంగిట....కంచుకి వైహీనరి ప్రవేశం)

వైహీ : సుగాంగ ప్రాసాద పరిజనం అంతా వినండి...మహారాజు చంద్రగుప్తుల వారు నగరమంతా కౌముదీ మహోత్సవం చేయాలని, తాము సింహాసనం అధిష్టించిన ఈ శుభ సమయంలో అందరూ వేడుకలు చేసుకోవాలని కోరుతున్నారు. నగరం అంతా అలంకరించండి..దీపాలతో దేదీప్య మానం చెయ్యండి.....

ఆ! ఏమంటున్నారు?....కౌముదీ మహోత్సవం నిషేదించబడ్డదా? ఆమాట అనడానికి ఎంత ధైర్యంమీకు? బ్రతుకు మీద ఆశవుంటే అటువంటి మాటలనకండి...దారి ఇవ్వండి...అరుగో! చంద్రగుప్త మహారాజులు విజయం చేస్తున్నారు.

చంద్ర : రాచరికం నిర్వర్తించడం కత్తిమీద సాములాంటిది.......రాజు తన అస్తిత్వం కోసం పనులు చేస్తే ప్రజలు హర్షించరు. ప్రజలకు హితం చెయ్యాలనుకుంటే, తన అస్తిత్వానికి ముప్పు.

గురుదేవులు చాణక్యుల వారేమో నువ్వు నాతో కలహించినట్లు నటించు..కొన్నాళ్లపాటు నీ రాజ్యపాలన నువ్వే చేసుకో – అని ఆదేశించాడు. అది అసంభవం అనిపించినా, గురుదేవుల ఆజ్ఞ ఉల్లంఘించడానికి వీలులేనిది కదా. వైహీనరీ! ఎక్కడా కౌముదీ మహోత్సవం చేస్తున్న జాడ కనిపించదేం?

వైహీ : చిత్తం.....మహారాజా....

చంద్ర : సందేహిస్తారేం? చెప్పండి....

వైహీ : కౌముదీ మహోత్సవం నిషేదించబడ్డదని విన్నాను ప్రభూ!

చంద్ర : ఎవరు నిషేదించారు? ఎవరు?

వైహీ : మహారాజా! అంతకు మించి ఈ సేవకుడు ఏమీ మనవి చేసుకోలేడు.

చంద్ర : అయితే, కౌముదీ మహోత్సవాన్ని ఆపుచేయమన్నది ఆర్యచాణక్యులవారా?

వైహీ : అంతకన్న మీ ఆజ్ఞలను కాదనగలవారెవరు మహారాజా?

చంద్ర : అయితే, వెంటనే చాణక్యుల వారిని పిలిపించండి..వెంటనే –

వైహీ : చిత్తం, మహారాజా......

(వడివడిగా వెడతాడు)

చాణ : (తన ఇంట్లో) నందవంశాన్ని నిర్జించి మౌర్య చంద్రగుప్తుడు సింహాసనం అధిష్టించడానికి నేను పన్నాగాలు పన్నినట్టే, మళ్ళీ చంద్రగుప్తుణ్ణి సింహాసనంనుంచి దించడానికి నువ్వు పన్నాగాలు పన్నుతున్నావా, రాక్షసా!....నువ్వు చాణక్యుడి వెలా అవుతావు?.....సిద్ధార్థకుడు మొదలైన వాళ్ళంతా ఇప్పటికే మలయకేతువును అన్ని పక్కలా చుట్టి వున్నారు. ఇప్పుడు నేను! చంద్రగుప్తుడితో మిధ్యావైరం తెచ్చుకొని రాక్షసుడి కన్నుకప్పాలి–

వైహీ : (చాణక్యుల వారి ఇంటికి వచ్చి) అబ్బా! రాజుల దగ్గర సేవవృత్తి ఎంత కష్టమైంది!.....ముందు రాజుగారికి భయపడాలి. ఆ తరువాత మంత్రి సామంతులకు, బంధుమిత్రులకు, చివరకు రాజుగారి ఆశ్రితులకు కూడా భయపడిచావాలి....కాని దీనిదుపం తెగ – అందులో ఉండే దర్జా చూస్తే మాత్రం ఎవ్వరూ ఒదులుకోరు.

(చాణక్యుని ఇంటిలోపలికి వచ్చి)

ఇదా! చతురం బోధిపరీత భూవలయాన్ని పాలిస్తున్న చంద్రగుప్త మహారాజుల అమాత్యులు చాణక్యులవారి ఇల్లు! ఒక పక్క దర్భలు, ఒక పక్క కచ్చిక చితగ్గొట్టడానికి రాయి.....దర్భాసనం..కూలడానికి సిద్ధంగా ఉన్న గోడలు!! అంతటి నిరాడంబరులు కనుకనే ఆర్య చాణక్యుల వారు అంతటి స్వతంత్రులు..అరుగో ఆర్య చాణక్యులు....గురుదేవులకు ప్రణామాలు.

చాణ : ఏం, వైహీనరీ? ఏమిటి విశేషం?

వైహీ : మహారాజులు తమ పాదపద్మాలకు వినయపూర్వకంగా ప్రణామం చేసి తమకు వీలున్నప్పుడు దర్శనం ఇవ్వవలసిందిగా ప్రార్థిస్తున్నారు.

చాణ : వృషలుడు మమ్మల్ని చూడాలనుకుంటున్నాడా? ఎందుకో?..ఆ! వైహీనరీ! కౌముదీ మహోత్సవాన్ని మేము ఆపు చేయించామని ప్రభువులకు ఎవ్వరూ విన్నవించలేదు కదా?

వైహీ : చిత్తం...ఆ సంగతి వారికి తెలిసిపోయింది.

చాణ : (కోపంతో) ఎవరు చెప్పారు?

వైహీ : ఎ..ఎ...ఎవ్వరూ చెప్పలేదు. ప్రభువులవారే స్వయంగా సుగాంగ ప్రాసాదం మీది నుంచి చూశారు.

చాణ : ప్రభువుల పరిజనానికి కూడా చాణక్యుడంటే ఎంత చులకన అయిపోయింది? ఎక్కడున్నాడు మౌర్యుడు?

వైహీ : సుగాంగ ప్రాసాదంలోనే ప్రభఋ!

చాణ : పద. నేనాయన్ని చూడాలి.

(ఇద్దరూ నడుస్తారు)

వైహీ : అరుగో మహారాజులు.

చాణ : మౌర్య చంద్రగుప్తుడికి జయం.

చంద్ర : చంద్రగుప్తుడు పూజ్యులకు నతమస్కుడై నమస్కరిస్తున్నాడు.

చాణ : చిరంజీవ!...లే, నాయనా!

చంద్ర : ఆ ఆసనాన్ని అలంకరించండి గురుదేవా.

చాణ : (కూర్చుని) మహారాజు మమ్మల్ని పిలిపించారట కారణం?

చంద్ర : తమ దర్శనభాగ్యం ఆపేక్షించే గురుదేవా!

చాణ : (నవ్వి) మెచ్చుకోలు చాలు మౌర్యా! మహారాజు తన కొలువులో పనిచేసే వాళ్లను ఊరికే పిలిపించడు..ఏమిటి కారణం.

చంద్ర : కౌముదీ మహోత్సవాన్ని తాము ఆపుచేయడానికి కారణం తెలుసుకుందామని.

చాణ : అయితే, నన్ను అభిశంసించడానికి పిలిచావన్నమాట! చాణక్యుడు కారణం లేకుండా ఏ పనీ

చెయ్యడని నీకు తెలియదూ?

చంద్ర : ఆ కారణం తెలుసుకోవాలన్న ఆసక్తితోనే –

చాణ : అయితే విను...అర్థశాస్త్ర వేత్తలు కార్యసిద్ధిని రాజాయత్తం, సచివాయత్తం, ఉభయాయత్తం అని మూడు విధాలుగా చెబుతారు. అందులో ఇది సచివాయత్తం....అంటే మంత్రులు చేపట్టిన అన్నమాట. కాబట్టి నువ్వు అడగనూ అక్కర్లేదు; నేను చెప్పనూ అక్కర్లేదు...

(రాజు కోపంతో పెడమొగం పెడతాడు. తెరలో వైతాళికులు)

అహో! రాజచంద్రా!

మిమ్ముబోలిన సర్వ భూమీ కళత్రు! వెన్నడేనియు తమ యాన కెదురుచున్న వారిని సహింపబూనరు కోటిలూడ్య! గాదలప పైలేని సింగముల పగిది॥

చంద్ర : ఆహా! ఏం చక్కగా చెప్పారు వైతాళికులు?

(తెరలో వైతాళికులు)

నగలు, ప్రక్చుందనాదులనంత ములుగ! దాల్చువారిని ప్రభులన దగదు చూనె!
ఆజ్ఞ ఎల్లడ న ప్రతిహతము గాగ! నడపు వాడవు నీ వహో పుడమి పతిని!!

చాణ : (తనలో) అహో! సమయం కాని సమయంలో ఈ వైతాళిక ప్రబోధం!..ఇది రాక్షసుని ఎత్తుగడే! రాక్షసా! చాణక్యుడు నిరంతరం అప్రమత్తంగా ఉంటాడురా!

చంద్ర : ఆర్యవైహీనరీ! ఈ వైతాళికులకు సహస్ర సువర్ణాలను బహుకరించండి.

వైహీ : ఆజ్ఞ!

(అని వెళ్ళబోతాడు)

చాణ : ఆగు వైహీనరీ!......వృషలా! ఎందుకీ వృధా వ్యయం?

చంద్ర : (కోపంగా) ప్రతి విషయంలోనూ మీరిచ్చే ఆజ్ఞ బంధాలతో ఈ రాజ్యం నాకు కారాగృహంలావుంది.

చాణ : స్వకార్య నిర్వహణం చేతకాని వారికి అలాగే వుంటుంది...నా జోక్యం ఇష్టం లేకపోతే నువ్వు స్వతంత్ర్యంగానే నీ పరిపాలన వ్యవహారాలు చూసుకోవచ్చు.

చంద్ర : మేమూ అదే ఆలోచిస్తున్నాం.

చాణ : సంతోషం.

చంద్ర : ఇంతకూ కౌముదీ మహోత్సవాన్ని నిషేధించడంలో ప్రయోజనం?

చాణ : ఉత్సవాన్ని జరపడంలో ప్రయోజనం ఏమిటో?

చంద్ర : మా ఆజ్ఞ నిర్వర్తించబడడం మేము చూడడమే!

చాణ : నేనూ అందుకే నిషేదించాను. నా ఆజ్ఞలపట్ల నీ వినయ విదేయతలు ఎలావుంటాయో లోకానికి చూపడమే నా అభిమతం.

చంద్ర : అంతేనా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా?

చాణ : ఉన్నాయి...నువ్వు తెలుసుకోదలుచుకుంటే ఇప్పుడే చెబుతాను...వైహీనరీ! రాజప్రాసాధికారి

అచలుడికి నేనొక పత్రం ఇచ్చాను తీసుకొనిరా.

వైహీ : చిత్తం.

(అని పత్రం తీసుకుని వచ్చి చాణక్యుడికి ఇస్తాడు)

చాణ : ఇందులో మన పక్షంనుంచి పారపోయిన వారి పేర్లు ఉన్నాయి.....భద్రభట్ట, పురుషదత్త, హింగురాట, బాలగుప్త, రాజసేన, భాగురాయణ, విజయవర్మాదులు –

చంద్ర : మరి మన అధికారులంతా – మనల్ని వదిలి శత్రుపక్షంలో ఎందుకు చేరారో తెలుసుకోవచ్చా?

చాణ : అధికారులా! ఒకరికి స్త్రీ వ్యసనం, మరొకరికి ధనాశ – ఇలానే.....వారి దుర్గణాలే వాళ్ళకా గతిపట్టించాయి.

చంద్ర : వారిలో ఉన్న దోషాలు తెలస్తే ప్రతిక్రియ చేయలేకపోయారా?

చాణ : వీలుకాలేదు.

చంద్ర : వీలుకాలేదా? చేతకాకనా?

చాణ : చేతకాకనా? కానేకాదు....మౌర్యా! విను – స్వజనం విరక్తులైనప్పుడు వాళ్ళ పట్ల అనుసరించవలసిన విధానం అనుగ్రహం, నిగ్రహం – అని రెండు విధాలు. నిగ్రహం అంటే వాళ్ళని దండించడం. అటువంటి గొప్ప అధికారుల్ని శిక్షిస్తే ప్రజల్లో అలజడి రావచ్చు. ఇక వారిని అనుగ్రహించి ఆ పదవులలోనే కొనసాగిస్తే మన రాజ్యానికే ముప్పు. అందువల్లనే వారు శత్రుపక్షంలో చేరుతున్నారని తెలిసికూడా ఉపేక్షించాను...ఇటువంటి సమయంలో మనం కోటను, మన బలగాలను శక్తిమంతం చేసుకోవాలి కాని ఉత్సవాలు చేసుకునే సమయం కాదు. అందుకే వాటిని నిషేధించాను.

చంద్ర : మరి ఇన్ని అనర్థాలకు హేతువైన మలయకేతువు పలయితుడైతే ఉపేక్షించారే?

చాణ : ఉపేక్షించకపోతే అతణ్ణి నిగ్రహించడమో, అర్థ రాజ్యం ఇవ్వడమో చెయ్యవలసి వచ్చేది. నిగ్రహిస్తే అతడి తండ్రిని చంపింది మనమేనని అందరికీ తెలుస్తుంది. అర్థరాజ్యం ఇస్తే పర్వతకుణ్ణి చంపించిన ఫలితం దక్కదు. అందుకే ఉపేక్షించాను.

చంద్ర : మరి నగరంనుంచి రాక్షసమంత్రి పారిపోతుంటే ఊరుకున్నారు? దానికి కూడా ఇదే కారణమా?

చాణ : కాదు...రాక్షస మంత్రి అంటే ఏమనుకున్నావ్? ఘటనా ఘటన సమర్థుడు. పైగా మన నగరంలో చిరకాలంగా ఉన్నవాడు...చాలా కాలం మహామాత్యుడు...అటువంటి వాడు నగరంలోనే ఉంటే ఎటువంటి సాహసానికైనా ఒడికట్టగలడు. అంత:కలహాలను రేపి రాజ్యానికే ముప్పు తేగలడు. దూరంగా ఉంటే ఎవరికి అండదండలూ ఉండవు కనుక అతడు చేయగల హాని అతిస్వల్పం.

చంద్ర : మీతో వాదించి గెలవడం సాధ్యంకాదు...మీరు ఎన్ని చెప్పినా మనల్ని ఇన్ని ఇబ్బందులు పెట్టిన రాక్షసుడే గొప్పవాడనిపిస్తుంది.

చాణ : (కోపంతో) నేను కాదనేగా? ఏమిటి రాక్షసుడి ఘనత?

చంద్ర : ఒకటేమిటి? ఇంకాలం మనల్ని ధిక్కరిస్తూ కూడా నగరంలోనే ఉండిపోయాడు. మనలో ముఖ్యులందర్నీ తన పక్షానికి రాబట్టుకున్నాడు. ప్రతి నిముషంల తన అశేష శేముషీ విభవంతో మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు.

చాణ : (వ్యంగ్యంగా) అంతేనా? నేను నందుల్ని నాశనం చేసి నిన్ను సింహాసాధిష్టుణ్ణి చేసినట్టు, నిన్ను

జయించి మలయకేతువుకు ఈ రాజ్యం ఇస్తాడేమో?

చంద్ర : నేను సింహాసనానికి రావడానికి మీరు చేసిందేమిటో?

చాణ : మూర్ఖుడా! అంతవరకూ వచ్చావ్? ఈ జుట్టు ముడిని వేసుకోనని చేసుకోనని ప్రతిజ్ఞ చేసి నందుల్ని నిర్జించింది నేను కాదూ? నీకు ఈ రాజ్యం రావడానికి కారణం నేను కాదూ?

చంద్ర : ఇందులో మీరు చేసిందేమిటి? ఇది నా అదృష్టం..నందుల దురదృష్టం.

చాణ : అదృష్ట దురదృష్టాలమీద ఆధారపడి పనులు చేసేవాళ్ళు అజ్ఞానులు.

చంద్ర : ఆత్మస్తుతికి పాల్పడే వారే విజ్ఞులు కాబోలు!

చాణ : ఏమన్నావ్! నన్నుకూడ నీ భృత్యుణ్ణనుకుంటున్నావా? మళ్ళీ ఈ శిఖ మీద ప్రమాణం చేసి శస్త్రం చేపట్టాలని నా చేతులు ఉద్యుక్తం అవుతున్నాయి...పున: ప్రతిజ్ఞా స్వీకారానికి నా ఒళ్ళు, ఉగ్రూతలూగుతోంది. నందవంశ వినాశనం వల్ల చల్లారిన నా క్రోధాగ్నిని మళ్ళీ రగిలిస్తున్నావు సుమా!

చంద్ర : (తనలో) గురుదేవా ఇదంతా నిజమని నమ్మి నామీద కోపం తెచ్చుకోవడం లేదు కదా!

చాణ : వృషలా! ఇక వాగ్వివాదాలు అవనవసరం...ఇదుగో నా అమాత్య ఖడ్గం. నా కన్న రాక్షసుడే యోగ్యుడని అనుకుంటున్నప్పుడు ఆ ఖడ్గాన్ని అతనికే ఇచ్చి అతనినే మంత్రిగా తెచ్చుకో –

(వెడతాడు)

చంద్ర : వైహీనరీ! ఈ రోజునుంచి చాణక్యుని అవసరం లేకనే మేమే స్వయంగా పాలనాధికారాలు నిర్వహిస్తామని ప్రజలందరికీ ప్రకటించు.

వైహీ : చిత్తం....ఆర్య చాణక్యుడనకుండా – ఒట్టిగా చాణక్యుడు అని మహారాజు అన్నాడంటే వీళ్ళిద్దరికీ మధ్య నిజంగా పొరపొచ్చాలొచ్చినట్టే రూఢి అవుతోంది....రాజుగారి ఆజ్ఞ పాలించాలి కదా! వెడతాను.

చంద్ర : గురుదేవులు చాణక్యులవారు...నువ్వు నాతో కలహించినట్టు నటించు..కొన్నాళ్లపాటు నీ రాజ్య పాలన నువ్వే చేసుకో – అని ఆదేశించారు. గురుదేవుల ఆజ్ఞానుసారం ఆయనతో మిథ్యా విరోధం తెచ్చుగుంటేనే నా పాదాల కింద భూమి కుండిపోయినట్టు అనిపిస్తోందే! ఇహ నిజంగా గురుధిక్కారం చేసిన వాళ్ళ హృదయాలు ఎందుకు బద్దలై పోవో?

# నాలుగో అంకం

(రాక్షసుడి ఇంటి ముందు వీధి.....కరభకుడి ప్రవేశం)

కర : అమ్మయ్యా! మొత్తానికి చేరుకున్నాను..రాజులో, మంత్రులో ఆజ్ఞాపించకపోతే రానుపోనూ ఇన్ని ఆమడల దూరం ఎవడు వెళ్ళొస్తాడు?....అమాత్య రాక్షసులను ఇప్పుడు కలవాలి.....ఎవరయ్యా, ద్వారపాలకులు? రాక్షసమంత్రిగిరితో కరభకుడు కుసుమపురంనుంచి శరవేగంగా వచ్చాడని చెప్పు.

ప్రియం : కరభవా! నువ్వా!....మెల్లగా మాట్లాడవయ్యా! అమాత్యులు రాజకార్యాలలో నిమగ్నులై రాత్రంతా మేలుకుని ఉండడం వల్ల శిరోభారంతో బాధపడుతున్నారు..కొంచెం సేపు వేచివుంటే వారి అనుమతి కాగానే లోపలికి తీసుకుపోతాను.

కర : సరే!

(రాక్షసుడు విశ్రమించి ఉంటాడు. పక్కనే శకటదాసు)

**రాక్ష** : రాత్రంతా నిద్రలేదు...ఆలోచనలతో మనసంతా చిందరవందరగా ఉంది. నా పరిస్థితి నాటకం రాస్తున్న నాటకకర్త స్థితిలా వుంది! ముందు ఇతివృత్తం ఆలోచించాలి..ఆ తరువాత బీజ, బిందు, ప్రకరులు సమకూర్చాలి....పాత్రల్ని అందులో నిర్వహించే విధానం చూడాలి. క్రమోన్మీలనం అయ్యాక అన్నింటికీ పతాక సన్నివేశానికి చేర్చాలి...అక్కడ వున్నాను, ఇప్పుడు.....చాణక్యా! నేను ఇన్ని చేసినా చివరకు నీకే –

**ప్రియం** : జయం, జయం

**రాక్ష** : పరాజయం

**ప్రియం** : రాక్షసామాత్యుల వారికి.

**రాక్ష** : అంటే – చాణక్యుల వారికి విజయమా, నాకు పరాజయమూనా? (ప్రియం వదకుడితో) ఏమిటి నువ్వు చెప్పదలుచుకున్నది?

**ప్రియ** : ప్రభూ! కుసుమపురం నుంచి కరభకుడు వచ్చి తమ దర్శనం కోసం వేచివున్నాడు.

**రాక్ష** : రమ్మను.

**కరభ** : జయం, జయం, అమాత్యులకు.

**రాక్ష** : కూర్చో........

(మాట్లాడుతూ వుంటారు.)

(తెరలో – దారి ఇవ్వండి, దారి ఇవ్వండి, యువరాజు మలయకేతువు వస్తున్నారు, దారి ఇవ్వండి – అంటూ హెచ్చరిక)

(మలయకేతువు, భాగురాయణుడు, జాజలి ప్రవేశిస్తారు)

**మల** : నాన్నగారు నిర్యాణం చెంది అప్పుడే పది నెలలయింది. వారికి ఇంతవరకు దోసెడు తిలోదకాలయినా ఇవ్వలేదు. నా తల్లుల దురవస్థను శత్రురాజుల స్త్రీలకు కూడా కలగచేసికాని తిలోదకాలివ్వనని ప్రతిజ్ఞ చేశాను. వీరుణ్ణి అయితే యుద్ధంలో పోరాడి తండ్రిగారి దగ్గరకయినా పోవాలి. లేకపోతే, తల్లుల కంటి నీరు తుడిచి, శత్రు భార్యలకు కంటనీరైనా తెప్పించాలి..

అయ్యా! జాజలి! అమాత్య రాక్షసులు అస్వస్థులుగా ఉన్నారని తెలిసింది. మేము ఒంటరిగానే వారిని చూస్తాం. భాగురాయణులొక్కరే మాతో ఉంటారు....మీరంతా ప్రాసాదానికి వెళ్ళండి......

**జాజలి** : చిత్తం.

(వెడతాడు)

**మల** : భాగురాయణా?

**భాగు** : ఏమిటి కుమారా?

**మల** : భద్రభటుడూ, పురుషదత్తుడూ మొదలైన వాళ్లు చంద్రగుప్తుడికి ఆప్తులు కాదూ?

**భాగ** : అవును.

**మల** : మరి అంతటి మిత్రులైవుండి కూడా అతణ్ణి వదిలి మన పక్షానికి ఎందుకు వచ్చారంటావ్.

భాగు : బహుశా ఆ చాణక్యుడి ఒత్తిడి భరించలేక వచ్చివుంటారు.

మల : వాళ్ళంతా నన్నే ఆశ్రయించడానికి కారణం?

భాగు : ఏముంది? సుగుణ సంపద ఉన్న రాజునే ఆశ్రయించమని ఆర్షధర్మం.

మల : వాళ్ళంతా మాకో విన్నపం చేశారు సుమామల

భాగు : ఏమని?

మల : మేము మిమ్మల్ని ఆశ్రయించింది అమాత్య రాక్షసుల వారి ద్వారా కాదు. మీ సర్వసేనాని శిఖరసేనుడి ద్వారా – ఆ సంగతి కొంచెం మనసులో ఉంచుకోండి ప్రభూ – అని.

భాగు : సమంజసమే కదా?

మల : సమంజసమా? నాకేం అర్థంకాలేదు...

భాగు : ఇందులో అర్థం కావడానికి ఏముంది? ఎవరైనా గొప్పవాణ్ణి ఆశ్రయించవలసి వస్తే, ఆ గొప్పవాడి ఆప్తుల ద్వారా ఆశ్రయించాలన్నది సంప్రదాయం.

మల : మరి రాక్షసులవారు మనకు ఆప్తులు కారా?

భాగు : కాకేం? పరమ ఆప్తులే! కాని భద్రభటాదులు అలా అనుకొని ఉండకపోవచ్చు.

మల : మరి?

భాగు : రాక్షసునికి అటు శత్రువెవరు? చంద్రగుప్తుడా, చాణక్యుడా?

మల : చాణక్యుడే!

భాగు : అతడు అమిత గర్విష్టి అని మీకు తెలుసా?

మల : అందరికీ తెలుసు.

భాగు : గర్విష్టి అయిన మంత్రితో ఏ రాజు మాత్రం ఎంతకాలం సయోధ్యగా ఉండగలడు?

మల : నిజమే! ఎక్కువకాలం ఉండలేడు.

భాగు : అందువల్ల చంద్రగుప్త, చాణక్యుల మధ్య విభేదాలు వచ్చి, వారిద్దరూ విడిపోతే – అటు నందుడి కొడుకయిన చంద్రగుప్తుడి కోసమో, ఇటు ప్రాణమిత్రుడయిన చందనదాసు వంటి వాళ్ళకోసమో రాక్షసుడు చంద్రగుప్తుడి పక్షానికి వెళ్ళవచ్చు కదా? అటువంటి రాక్షసుడి ద్వారా మీ ఆశ్రయం పొందితే మీరు వాళ్ళను కూడా అనుమానిస్తారేమో – అన్న భయంతో వాళ్ళు అట్లా చెప్పి వుండవచ్చు.

మల : నిజమే సుమా!

రాక్ష : కరభకా! కుసుమపురంలో స్తవకలశుడనే వైతాళికుణ్ణి కలిశావా?

కర : చిత్తం.

మల : భాగురామణా! వీళ్ళు కుసుమపురం విషయాలే మాట్లాడుకుంటున్నారు..ఇక్కడే వుండి విందాం.

రాక్ష : ఆ పని నెరవేరినట్లేనా?

కర : తమ అనుగ్రహం ఉంటే నెరవేకుండా ఉంటుందా?

మల : ఏమిటో ఆ పని?

భాగు : అమాత్యులవారి వ్యవహారం దువగాహంగా ఉంది. మనం అప్పుడే ఒక నిర్ణయానికి రాకూడదు. జాగ్రత్తగా విందాం.

రాక్ష : వైతాళికుడు సకాలంలో చాకచక్యంగా వ్యవహరించాడా?

కర : చిత్తం స్వామీ! ప్రజల సంతోషానికి చంద్రగుప్తుడు కౌముదీ మహోత్సవం జరపాలని ఆదేశిస్తే, చాణక్యుడు జరపకూడదని ఆజ్ఞాపించాడట..ఆ అదను చూసుకుని మన వైతాళికుడు –

రాక్ష : ఆ! ఏమన్నాడు?

కర : చంద్రగుప్తుణ్ణి పొగుడుతూ – "ఆభరణాలు ధరించిన ప్రభువే ప్రభువా? నీ ఆజ్ఞల్ని అవ్యాహతంగా నెరవేర్చిన ప్రభువే 'ప్రభు' పదానికి తగినవాడు – అన్నాడట.

రాక్ష : చాలా నేర్పుగా చెప్పాడు. తరువాత?

కర : ఆ మాటల్ని విన్న చంద్రగుప్తుడు ముగ్ధుడై, తమర్ని పొగిడి చాణక్యుణ్ణి మంత్రిపదవి నుంచి తప్పించాడట!

రాక్ష : కరభకా! చంద్రగుప్తుడికి చాణక్యుడి మీద కోపం రావడానికి కౌముదీ మహోత్సవ నిషేధం ఒక్కటే కారణం అంటే నమ్మలేకుండా ఉన్నాను.

మల : మరేదో కారణం ఉండాలని రాక్షసమంత్రి అనడంలో ఆంతర్యం ఏమిటో?

భాగు : ఏముంది? ఈ కాస్త విషయానికే చాణక్యుడిని దూరం చేసుకోడు చంద్రగుప్తుడు. పైగా బలమైన కారణాలుంటే వారిద్దరి మధ్య కోపతాపాలు శాశ్వతంగా ఉండిపోయి దూరం అయిపోతారు గదా – అని.

కర : మరో ముఖ్యమైన కారణం ఉంది ప్రభూ!

రాక్ష : ఏమిటది?

కర : మలయకేతువున పలాయితుడైనప్పుడు చాణక్యుడు ఉపేక్షించాడని –

రాక్ష : భళీ! ఇది ముఖ్యమైన కారణమే! ఇక చాణక్యచంద్రగుప్తుల కలయిక జరిగే పనికాదు. హు! చంద్రగుప్తుడు  ఇక నాకు చిక్కినట్టే! ఏమంటావ్ శకటదాసూ?

శకట : అవును అమాత్యా! ఇక చందనదాసుకు చెరసాలనుంచి విముక్తీ, మీ ఆలుబిడ్డల సమాగమం, జీవిసిద్ధి కష్టాలు గట్టెక్కడం –

మల : మిత్రమా! ఇక చంద్రగుప్తుడు నాకు చిక్కినట్టే అనడంలో ఆంతర్యం ఏమిటో?

భాగు : ఏముందీ? చాణక్య వియోగం పొందిన చంద్రగుప్తుణ్ణి తాను చేజిక్కించుకోవచ్చు గదా – అని.

రాక్ష : పదవీ చ్యుతుడైన చాణక్యుడు ఎక్కడ వున్నాడు?

కర : ఇంకా కుసుమపురంలోనే వున్నాడట! త్వరలోనే తపోవనానికి వెళ్ళిపోతాడని ప్రతీతి.

మల : చాణక్యుడేమై పోతే తన కెందుకు?

భాగు : అహ...చాణక్య చంద్రగుప్తులు ఎంతదూరంగా ఉంటే తనకంత మంచిదని.

రాక్ష : శకటదాసూ! ఇక కరభకుడికి విశ్రాంతి విషయం చూడు.....మేము కుమార మలయకేతువును కలుసుకోవాలి.

(మలయకేతువు, భాగురాయణుడు రాక్షసుని ఇంట్లోకి ప్రవేశిస్తారు)

మల : మేమే తమ దర్శనార్థం వచ్చాం, అమాత్యా!

రాక్ష : రండి, రండి....కూర్చో కుమారా!

మల : తమ అస్వస్థత ఉపశమించిందా?

రాక్ష : కుమారా! నీకు మహారాజ పదవి లభించకుండా నా అస్వస్థత ఎలా ఉపశమిస్తుంది?

మల : తమరుండగా అసాధ్యం ఏముంటుంది?..కాని, ఇంతటి సైన్యాన్ని సమకూర్చుకుని, ఎన్నాళ్ళిలా శత్రుపక్షంలో కలతల కోసం ఎదురు చూస్తూ కూర్చుంటాం?

రాక్ష : ఇక ఆలస్యం అనవసరం. మంచి ముహూర్తం చూసి మన విజయప్రస్థానం ప్రారంభించవచ్చు.

మల : అయితే, శత్రు పక్షంలో విభేదాలు వచ్చిన జాడ ఏమైనా ఉందా?

రాక్ష : అవును. చాణక్య చంద్రగుప్తుల మధ్య విభేదాలు వచ్చాయి....చాణక్యుడు పదవీచ్చుతుడైనాడు.

మల : అయితే చంద్రగుప్తుడి ఆప్తవర్గం అతనికింకా దగ్గర ఔతారేమో? చాణక్యుడంటేనే వారికి కోపం.

రాక్ష : కాని, ఇప్పటికే చాణక్యుడంటే పడని వాళ్ళంతా మన పక్షాన చేరారు. నందవంశ పక్షం వాళ్లు ఎప్పుడూ మన వాళ్ళే! ఇదే అదను విజయప్రస్థానానికి.

మల : అమాత్యా! చాణక్యుడు లేకపోయినంత మాత్రాన చంద్రగుప్తుడికి మరో అమాత్యుడే దొరకడా?

రాక్ష : చాణక్యుడు లేని చంద్రగుప్తుడు తల్లి నుంచి వేరుచేసిన శిశువు....అశక్తుడు.

మల : ఈ ఒక్క కారణమే కాక, ఇంకేమైనా కారణాలుంటే బావుండును.

రాక్ష : లేకేం కుమారా?

నువ్వూ, నీ వెనక మహత్తరమైన సేనావాహిని.

నందులంటే ప్రాణాలిచ్చే పౌరులు

పదవీ చ్చుతుడైన చాణక్యుడు

నీకు మంత్రాంగం జరపడానికి ఈ రాక్షసమంత్రి –

మల : మీరు ఇన్ని కారణాలున్నాయని భావిస్తున్నప్పుడు ఇంకా ఆలస్యం దేనికి? అందుకు తగిన సన్నాహాలు చేయిస్తాను. ముహూర్తం పెట్టించండి.

రాక్ష : శుభం భుయాత్. (మలయకేతువు, భాగురాయణులు వెడతారు)
ప్రియంవదకా? అందుబాటులో జ్యోతిష్యులెవరున్నారు?

ప్రియం : జైన క్షపణకులైన జీవిసిద్ధి ఇక్కడనే వున్నాడు ప్రభూ!

రాక్ష : ముందే క్షపణకూడా? సరే! రమ్మను – భగిన వస్త్ర ధారణం చేసి మరీ రమ్మను.

ప్రియం : చిత్తం.

(వెడతాడు. జీవసిద్ధి వస్తాడు)

జీవ : శాలివకా! మీరు ధర్మవృద్ధి కావాలని కోరుకుంటున్నాను.

రాక్ష : భదంతా! దండయాత్రకు మంచి ముహూర్తం చూడండి.....

జీవి : (లెక్కలు గుణించి) పౌర్ణమి ప్రసస్థంగా ఉంది. ఉత్తరం నుంచి దక్షణానికి కదూ ప్రయాణం..అందువల్ల సూర్యాస్తమయ సమయం....పూర్ణ చంద్రోదయ సమయం....అమోఘంగా ఉంది. లగ్నం బుధుడు...కేతువు అస్తమిస్తాడు.

రాక్ష : మరెవరితోనైనా సంప్రదించిచూడకూడదు?

జీవి : మీరే సంప్రదించుకోండి..నేను పోతున్నాను

**రాక్ష** : భదన్తా! కోపంరాలేదు కదా?

**జీవ** : కోపం వచ్చింది నాకు కాదు....విధికి. స్వంత మనిషి చెప్పింది కాదని మరెవరినో సంప్రదిస్తే విధికి కోపంరాదూ? నేను పోతున్నాను.

(వెడతాడు)

**రాక్ష** : ప్రియంవదకా! ఎంత పొద్దుపోయింది?

**ప్రియం** : సూర్యాస్తమయ సమయం ఆసన్నమయింది అమాత్యా!

**రాక్ష** : సూర్యాస్తమయ సమయమా? చంద్రోదయ సమయమా?

(వెడతాడు)

# అయిదో అంకం

(మలయ కేతువు యుద్ధ శిబిరం బయట)

**సిద్ధా** : (ప్రవేశిస్తూ) ఆర్య చాణక్యులవారి ఊహలూ, ఉద్దేశాలు నాలాంటి వాళ్ళకు అర్థం కావు కదా! శకటదాసు దస్తూరితో లేఖ రాయించి, దానిమీద రాక్షస ముద్ర వేసిన ఈ లేఖా, రాక్షసముద్ర వేసిన ఈ నగలపెట్టె తీసుకుని కుసుమపురం రావాలని చాణక్యులవారి ఆజ్ఞ.....వెడదాం.

అదుగో క్షపణకుడు జీవిసిద్ధి ఇటే వస్తున్నాడు....భదంతా! నమస్కారం.

**జీవ** : ఎక్కడికో ప్రయాణం అయినట్లుగా ఉంది?

**సిద్ధా** : తమకెలా తెలిసింది?

**జీవ** : పిచ్చివాడా! దానికి సాముద్రికం తెలియాలా? చేతిలో ఆ పెట్టె, ఆ లేఖ –

**సిద్ధా** : నిజం.....దేశాంతరం పోవాలనే ప్రయాణం..ఇవ్వాళ మంచి రోజేనా?

**జీవ** : గుండు గొరికించుకున్నాకనా మంచి రోజు చూడడం?

**సిద్ధా** : ఇవాళ తిథి వార నక్షత్రాలు బావుంటేనే వెడతాను..

**జీవ** : పిచ్చివాడా! అన్నీ బావున్నా, అనుమతి ముద్ర దొరక్కపోతే ఈ శిబిరం దాటి బైటికి పోలేవు.

**సిద్ధా** : ఎందుకని?

**జీవ** : ఇదివరకు సైన్య శిబిరాలను ఎవరు ఎప్పుడు వదిలి వెళ్ళినా పట్టించుకునే వాళ్ళు కాదు....మన సైన్యం కుసుమపురానికి దగ్గరగా వెడుతున్న కొద్దీ అధికారముద్ర లేకుండా బయలుదేరు.

**సిద్ధా** : నేను రాక్షసుడికి సన్నిహితుణ్ణి...నన్ను ముద్ర అడిగేది ఎవరు?

**జీవ** : రాక్షసుడికి సన్నిహితుడవయినా, పిశాచానికి మిత్రుడివైనా అనుమతి పత్రం అనుమతి పత్రమే!

**సిద్ధా** : చూద్దాం...నాకు కార్యసిద్ధి కావాలని దీవించు....

**జీవ** : అట్లాగే! నీ కార్యం నిర్విఘ్నంగా కొనసాగుతుందిలే! .....నేను కూడా భాగురాయణుడి దగ్గరకు పోయి అనుమతి ముద్ర తీసుకోవాలి.

(వెడతారు)

## ఇది విష్కంభం

(భాగురాయణుడు, భాసురకుడు వస్తారు)

**భాగు** : భాసురకా! కుమార మలయకేతువు నన్ను తనకు అందుబాటులో ఉండమని ఆదేశించాడు. అందువల్ల ఈ ఆస్థాన మంటపంలో కూర్చుని ఉంటాను...యువరాజులు వస్తే తెలియచెయ్యి......ఆ! ఆమోదముద్ర కోసం ఎవరన్నా వస్తే లోనికి పంపు....

భాసు : చిత్తం.

భాగు : (లోపలకు పోయి, కూర్చుని) నా మీద ఇంతటి ప్రేమానురాగాల్ని పెంచుకుంటున్న మలయకేతువును మోసగించడమంటే బాధగా ఉంది...కాని ఆర్యచాణక్యులవారి ఆదేశం జరిగి తీరవలసిందే!

జీవ : (ప్రవేశించి) భాగురాయణులవారిని చూడాలి, ఆమోదముద్ర కోసం

భాసు : లోపల వున్నారు, చెప్పి వస్తాను..

భాసు : (లోపలికి పోయి) ఆర్యా! క్షపణకుడు జీవసిద్ధి ఆమోద ముద్రకోసం తమను చూడడానికి వచ్చాడు.

భాగు : లోపలకు పంపు.

భాసు : (లోపలకు దారి చూపుతాడు)

మల : (వచ్చి) భాసురకా! భాగురాయణుడెక్కడ?

భాసు : లోపల వున్నారు ప్రభూ!

మల : నువ్వు చప్పుడు చెయ్యకు. నేను చప్పుడు చెయ్యకుండా వెళ్ళి అతణ్ణి ఉలిక్కిపడేటట్టు చేస్తాను.

భాసు : చిత్తం.

జీవ : శ్రావకా! నీకు ధర్మసిద్ధి కలగాలని కోరుతున్నాను.

భాగు : అమాత్య రాక్షసులవారి ఆప్తమిత్రుడు జీవసిద్ధా? అమాత్యుల వారి పనిమీదనేనా ప్రయాణం?

జీవ : ఛా! ఛా! రాక్షసుని పేరైనా వినబడని చోటుకు పోవాలని –

భాగు : స్నేహితుని మీద అంత ఆగ్రహం ఎందుకయ్యా? ఆయన నీకేం అన్యాయం చేశాడు?

జీవ : ఆయనేం చెయ్యలేదు. దౌర్భాగ్యుణ్ణి...నాకు నేనే అన్యాయం చేసుకున్నాను...నా ప్రారబ్ధంలే..

భాగు : ఆశ్చర్యంగా ఉందే!

మల : నాక్కూడా!

భాగు : కొంచెం అర్థం అయ్యేటట్లు చెప్పు...వింటాను.

మల : నాకూ వినాలనే వుంది.

జీవ : నోటితో చెప్పడానికే వీలులేని దాన్ని వినడం ఎందుకులే?

భాగు : అంతటి రహస్యమా? అయితే చెప్పొద్దులే –

జీవ : రహస్యమని కాదుగాని.....అయినా చెప్పను....

భాగు : చెప్పకపోతే నీకు ఆమోద పత్రం దొరకదు..

జీవ : పెద్ద ఇబ్బంది తెచ్చిపెట్టావే! అయితే, విను..వెనక, నేను కుసుమపురంలో ఉన్నప్పటి సంగతి.... రాక్షసుడూ, నేను బాగా స్నేహంగా ఉన్న రోజుల్లో – నన్ను ముందు నిలబెట్టి – విషకన్యను ప్రయోగించి పర్వతేశ్వరుణ్ణి చంపించాడు..ఇది పరమ రహస్యం....

మల : ఏమిటీ! నా తండ్రిని చంపించిన వాడు రాక్షసుడా? చాణక్యుడుకాదా?

భాగు : అదేమిటయ్యా! అర్ధరాజ్యం ఇవ్వవలసి వస్తుందని చాణక్యుడే పర్వతేశ్వరుణ్ణి చంపించాడని విన్నామే!

జీవ : ఛ! ఛ! పాపం, చాణక్యుడికి విషకన్య పైనమే తెలియదు...నాకూ, రాక్షసుడికి మాత్రమే తెలుసు.

భాగు : ఆ! తరువాత?

జీవ : ఆ తరువాత చాణక్యుడు నన్ను అనుమానించి, అవమానించి దేశం నుంచి వెళ్ళగొట్టాడు..ఇప్పుడు

రాక్షసుడు నన్ను ఈ ప్రపంచంనుంచే వెళ్ళగొట్టడానికి ఎత్తు వేస్తున్నాడు...అందుకే ఇక్కడనుంచి పారిపోతున్నాను.

భాగు : సరే! ఇదుగో ఆమోదముద్ర.....చూడు! వెళ్ళేటప్పుడు యువరాజు మలయకేతువుకు కూడా ఈ మాట చెప్పిపో –

మల : విన్నాను, భాగురాయణా! విన్నాను....ఈ రాక్షసుడు ఎంతటి పాపానికి ఒడిగట్టాడు?....తనే సర్వస్వం అని నమ్మి ప్రాణాధికంగా చూసుకున్న నా తండ్రినా అకారణంగా చంపించాడు? రాక్షసా!.....నిన్నేం చేస్తానో చూడు....నిన్ను – నిన్ను –

(అని కత్తిని ఒరనుంచి లాగుతాడు)

భాగు : (తనలో) రాక్షసునికి ప్రాణాపాయం కలుగకూడదని చాణక్యులవారి ఆజ్ఞ! (పైకి) కుమారా! ఆవేశపడకు.... కూర్చో –

మల : ఏం?

భాగు : ఇటువంటి సమయంలోనే నిగ్రహం పోగొట్టుకోకూడదు...రాజనీతిలో సాధించవలసిన కార్యాలే ముఖ్యంగాని, మిత్రత్వాలు, శత్రుత్వాలు ముఖ్యాంశాలు...అప్పట్లో సర్వార్థసిద్ధిని రాజును చేద్దామనుకున్నాడు రాక్షసుడు....చంద్రగుప్తుడికన్న నీ తండ్రి బలవంతుడు కనుక, నీ తండ్రిని ముందు చంపించాడు....ఇప్పుడు మన కార్యం సిద్ధించాలి కనక, అప్పటివరకు ఏమీ తెలియనట్లే వుండాలి. ఏమంటావ్?

మల : నిజమే!...ఇప్పుడు రాక్షసుణ్ణి చంపితే ప్రజాసంక్షోభం ఎక్కువై, మనకున్న విజయావకాశాలు కూడా తక్కువే కావచ్చు.

(భాసురకుడు, సిద్ధార్థకుణ్ణి తీసుకుని ప్రవేశిస్తాడు.)

భాసు : ప్రభూ! జయం.....జయం....ఇతడు ఈ లేఖలో ఆమోదముద్ర లేకుండా శిబిరం దాటుతుంటే దీర్ఘచక్షువు పట్టుకున్నాడు...ప్రభువును స్వయంగా పరిశీలించాలని మనవి చేస్తున్నాడు...

భాగు : ఎవరు నువ్వు?

సిద్ధా : అమాత్యా రాక్షసులవారి ఆశ్రితుణ్ణి.

భాగు : అయితే ఆమోదముద్ర లేకుండా బయటకు ఎందుకు వెడుతున్నావు?

సిద్ధా : అత్యవసరమైన పని వల్ల –

మల : భాగురాయణా! ఆ లేఖను ఇలా అందుకో –

భాగు : (లేఖను తీసుకుని) అరె! దీనిమీద రాక్షసుని ముద్ర ఉందే!

మల : ఊ! ముద్ర చెదిరిపోకుండా లేఖను తెరిచి ఇలా ఇవ్వు...

భాగు : అలాగే!

(లేఖను ఇస్తాడు)

మల : (ఉత్తరం చదువుతాడు)

"స్వస్తి –

మన శత్రువును నిర్జించి నీ మాట నిలబెట్టుకున్నావు.....మన సంధి ఒడంబడిక ప్రకారం మనకు

సహాయం చేసిన ఐదుగురు రాజులకు కూడా అనుకున్న ప్రకారం పారితోషికం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. వారికి మన మాట చెల్లిస్తేనే, వారు తమ ప్రస్తుత ప్రభువును పరిమార్చి మనకు విజయం తెచ్చిపెట్టగలరు. అందులో కొందరు పరిమార్చే శత్రువు యొక్క కోశాగారాన్ని, మరికొందరు గజదళాన్ని కోరుతున్నారు...మీరు పంపిన ఆ మూడు నగలూ చేరాయి....మా పారతోషికం కూడా స్వీకరించు...మా సందేశాన్ని అప్పుడు సిద్ధార్థకుడు చెప్పగలడు."

భాగురాయణా! ఏమిటీ లేఖ?

భాగు : (గద్దిస్తూ, సిద్ధార్థకుడితో) ఏమిటీ లేఖ?

సిద్ధా : లే......ఖ...ప్రభూ!....లే....ఖే–

భాగు : అది తెలుస్తూనే వుంది? ఎవరికీ లేఖ?

సిద్ధా : (భయంగా) తెలియదు ప్రభూ?

భాగు : ధూర్తుడా! లేఖను తీసుకువెడుతున్నావు!....ఎవరికో తెలియదా? పోనీ, నువ్వు చెప్పవలసిన సందేశం ఎవరితో?

సిద్ధా : సందేశమా?....మీ....మీతోనే –

భాగు : ఎవరు పంపారు?

సిద్ధా : మీ...మీరే!

భాగు : ఏమిటీ అసందర్భ ప్రలాపాలు?

సిద్ధా : మీరు గద్దిస్తుంటే...ఏం చెప్పాలో....తెలియడం లేదు.

భాగు : తెలియడం లేదే? భాసురకా! ఇతని చేత నిజం చెప్పించు –

(భాసురకుడు అతణ్ణి కొరడాతో కొడతాడు. కొడుతూ ఉండగా చంకలోంచి పెట్టె కిందపడుతుంది)

అరె! కందకంలోంచి పెట్టె కిందపడ్డది!

భాగు : (భాసురకుడు అందిస్తే పెట్టె తీసుకుని) దీనిమీద కూడా రాక్షసుడి ముద్రే వుందే!

మల : లేఖలో చెప్పిన పారితోషికం అయివుండాలి! ముద్ర చెదరకుండా అందులో ఏముందో చూడు –

(అలా చేసి, ఆభరణం తీసి మలయకేతువుకు ఇస్తాడు భాసురకుడు)

అరె! ఇది మా ఆభరణమే! మేం స్వయంగా రాక్షసమంత్రికి పంపినది....అంటే ఈ లేఖ రాక్షసుడు చంద్రగుప్తునకు వ్రాసిందై ఉండాలి.

భాగు : ఆ సంగతి ఇతని చేతనే చెప్పించాలి....ఊ!

(మళ్ళీ అతన్ని కొడతారు)

సిద్ధా : అమ్మ, బాబోయ్! కొట్టకండి, కొట్టకండి...అంతా మనవి చేసుకుంటాను...ప్రభువులవారు నాకు అభయం ఇవ్వాలి....

మల : నీకేం భయం లేదు...నిజం చెప్పు.

సిద్ధా : అమాత్య రాక్షసులవారు ఈ లేఖను చంద్రగుప్తులకిమ్మని ఆజ్ఞాపించారు.

మల : నీతో పంపిన సందేశం ఏమిటో కూడా చెప్పు –

**సిద్ధా** : రాక్షసులవారు ఏమని చెప్పమన్నారంటే – "కులాట, మలయ, కాశ్మీర, సింధు, పారశీక దేశాధిపతులు ఐదుగురూ నాకు మిత్రులు. సంధికి అంగీకరించారు. మొదటి ముగ్గురూ మలయకేతు రాజ్యాన్ని, మిగిలిన ఇద్దరూ కోశాగారాన్ని, గజసైన్యాన్ని ఆపేక్షిస్తున్నారు..చాణక్యుణ్ణి తొలగించి నాకు సంతోషం కలిగించినట్లుగానే వీరి కోరిక కూడా మన్నించి సంధి శుల్కాలనివ్వవలసింది" అని మనవి చెయ్యమన్నారు.

**మల** : (తనలో) ఏమిటీ! కులాటాది దేశాధిపతులు కూడా మిత్రద్రోహానికి పాల్పడుతున్నారన్న మాట! అందుకే రాక్షసుడంటే వారికి అంత ప్రీతి!....భాసురకా! మేము వెంటనే రాక్షసుణ్ణి చూడాలి.

**భాసు** : చిత్తం ప్రభూ!

(వెడతాడు. రాక్షసుడు తన గదిలో, ప్రియంవదకునితో)

**రాక్ష** : ప్రియంవదకా! కుమార మలయకేతువు వెంటవుండే రాజులకి మా మాటగా చెప్పు...మనం కుసుమపురాన్ని సమీపిస్తున్నాం కనుక. ఇక ముందు జరిగే ప్రయాణంలో సేనావిభాగాన్ని మలయకేతువును వెంటనంటి నడవాలని చెప్పు....

**ప్రియం** : చిత్తం.

(వెళ్లబోతూ వుండగా భాసురకుడి ప్రవేశం)

**భాసు** : జయం అమాత్యులకు..యువరాజు మలయకేతువు తమను చూడాలని వార్త పంపారు.

**రాక్ష** : కొంచెం ఆగు...ప్రియంవదకా! శకటదాసు నడిగి మనం వర్తకుల దగ్గర కొన్న ఆభరణాలలో ఒకదానిని ఇవ్వమని చెప్పు.....

**ప్రియం** : చిత్తం

(వెడతాడు)

**రాక్ష** : నేను నిరలంకృతంగా కుమారుణ్ణి చూడడం అతడికి నచ్చదు.

**ప్రియం** : ప్రభూ!

(ఆభరణం తీసుకుని వస్తాడు. రాక్షసుడు ధరిస్తాడు)

**రాక్ష** : మలయకేతువు ఉన్న చోటుకు మార్గం చూపు....

**భాసు** : ఇటు రండి..అమాత్యా!
ఇదుగో ఈలోపల ఉన్నారు యువరాజులు –

**రాక్ష** : (ప్రవేశించి) కుమారా! విజయోస్తు –

**మల** : అమాత్యా! అభివాదాలు!....కూర్చోండి.

**రాక్ష** : ఎందుకో కబురు పంపారట?

**మల** : విజయ యాత్ర సన్నాహాలు పూర్తయ్యాయేమో తెలుసుకుందామని. యుద్ధ వ్యూహం ఏమిటో విందామని–

**రాక్ష** : ఇప్పుడే రాజులందరికీ వార్త పంపాను. మగధ, ఖశ సైన్యాలు నన్ను అనుసరించి అగ్రభాగాన ఉంటాయి.....కుణ, శక సైన్యాలు మధ్యలో ఉంటాయి.....కులాటాది దేశాధిపతులు మీ వెంటనంటి నడుస్తారు....

మల : (తనలో) ఏమిటీ! చంద్రగుప్తుడితో సంధి చేసుకొని నన్ను హతమార్చడానికి చేసే రాజులు నన్ను పరివేష్టించి ఉంటారా?

(పైకి) అమాత్యా! మీరు అత్యవసరంగా కుసుమపురానికి వర్తమానం ఏమన్నా పంపారా?

రాక్ష : ఇంకా వర్తమానాలెందుకు కుమారా? మనమే త్వరలో అక్కడికి చేరుకోబోతూ ఉంటే!

మల : అలా అయితే ఈ లేఖనిచ్చి ఇతణ్ణెందుకు కుసుమపురం పంపుతున్నారు?

రాక్ష : సిద్ధార్థకా! నువ్వా! ఏమయింది?

సిద్ధా : రక్షించండి అమాత్యా!...దెబ్బలకు ఓర్వలేక నిజం చెప్పేశాను...

రాక్ష : నిజమేమిటి? చెప్పడమేమిటి? అసలేం అర్థం కావడం లేదు.

సిద్ధా : చచ్చేటట్లు కొడుతూవుంటే రహస్యం కాస్తా చేప్పేశాను స్వామీ.....

రాక్ష : రహస్యమా?....నాకేం అర్థం కావడంలేదు.

మల : భాగురాయణా! ఆ లేఖను రాక్షసులవారికి చూపించు.

భాగు : అమాత్యా! ఆ లేఖను, దానితోపాటు ఒక సందేశాన్ని మీరు చంద్రగుప్తుడికి పంపినట్లు ఇతడు చెబుతున్నాడు.

రాక్ష : ఇది నిజమా సిద్ధార్థకా?

సిద్ధా : కొడితేగాని ఈ సంగతి చెప్పలేదు అమాత్యా!

రాక్ష : ఇది అంతా అబద్ధం...ప్రాణభయంతో ఎవరైనా ఏమనైె చెప్పవచ్చు.

మల : అయితే లేఖను చూపించు భాగురాయణా!

భాగు : ఇదుగో!

రాక్ష : (తీసుకుని) ఇది శత్రు పన్నాగం యువరాజా!

మల : తమరు ఆ లేఖతో ఈ ఆభరణాన్ని కూడా పంపారు. ఇది కూడా శత్రువుల పన్నాగమేనా?

రాక్ష : (ఆభరణాన్ని చూసి) ఇది నేను పంపలేదు, యువరాజా! ఇది మీరిచ్చిన ఆభరణమే!...దీనిని ఒక అవసరమైన కార్యంలో తోడ్పడ్డందుకు సిద్ధార్థకుడికి బహుమతిగి ఇచ్చాను.

భాగు : ఇది స్వయంగా యువరాజులు మీకు పంపిన ఆభరణం....ఇంతటి అమూల్యమైన ఆభరణాన్ని ఎంత సహాయపడ్డా మరొకరికి కానుకగా ఇస్తారా?

మల : లేఖ చివర – మాకు అప్పుడు సిద్ధార్థకుడు మీకు మా సందేశం అందచేస్తాడని కూడా వ్రాశారే!

రాక్ష : లేఖే నాదికానప్పుడు, సందేశం నాదెలా అవుతుంది?

మల : అయితే కపటముద్రను సృష్టించడం ఎంతసేపు?

భాగు : సిద్ధార్థకా! ఈ ఉత్తరం వ్రాసిందెవరు?

సిద్ధా : అది....రాసింది.....రాసింది.

భాగు : మళ్ళీ దెబ్బలు తినకుండా నిజం చెప్పు –

సిద్ధా : శకటదాసు రాశాడు.

మల : శకటదాసుని పిలిపించండి.

భాగు : శకటదాసు రాక్షసులవారి సమక్షంలో ఆ వ్రాత తనదని ఎలాగూ ఒప్పుకోడు....అందుకని అతని

వ్రాత నమూనా తెప్పిద్దాం – భాసురకా! వెంటనే శకటదాసు వ్రాసిన ఏ పత్రం ఉన్నా తీసుకురా!

**భాసు** : ఇదుగో! ఇక్కడే వుంది ప్రభూ!

(తెచ్చి ఇస్తాడు)

**మల** : అక్షరాలు రెంటింలోనూ ఒకటిలానే వున్నాయి.

**రాక్ష** : అక్షరాలు చూస్తే శకటదాసు వ్రాసినట్లే వున్నాయి! శకటదాసుకూడా స్వలాభంకోసం మిత్రద్రోహం చెయ్యలేదు కదా!

**మల** : "మీరు పంపిన నగలు అందాయి" అని వ్రాశారు..మీరు ధరించిన ఆభరణం అందులో ఒకటా? (దగ్గరగా చూచి) ఇది మా పితృపాదుల ఆభరణంలా వుంది...అమాత్యా! మీరు ధరించిన ఆ ఆభరణం మీకెక్కడిది?

**రాక్ష** : ఎవరో వర్తకులు తెస్తే కొన్నాం.

**మల** : భాసురకా! దీనిని గుర్తు పట్టగలవా?

**భాసు** : చిత్తం. ఇది పర్వతేశ్వర మహారాజులు ధరించే వారండి....వారిదేనండి –

**రాక్ష** : పర్వతకుడు ధరించేవాడా? అయితే ఇప్పుడంతా స్పష్టంగా కనిపిస్తున్నది. చాణక్యుడే వీటిని తనవాళ్ళ చేత నాకు విక్రయిచేటట్లు చేశాడు.

**మల** : అమాత్యా! చంద్రగుప్తుడి దగ్గరకు చేరిన మా నాన్నగారి ఆభరణాలు మీరు కొనడం ఎలా సంభవం? ఒక విధంగా నిజమే! చంద్రగుప్తుడే అమ్మాడు...కాని ధనం కోసం కాదు; మా ప్రాణాలు తియ్యడం కోసం వాటిని కానుకగా పంపాడు.

**రాక్ష** : అయ్యో! ఎంతటి దోషారోపణం! కుమారా!...ఇదంతా అభూతకల్పన!...(తనలో) కాని లేఖమీద నాముద్ర ఉంది కనుక అది నాది కాదనడానికి వీలులేదు...శకటదాసు నాకు మిత్రుడే కాదంటే ఎవరు నమ్ముతారు? మహారాజైనవాడు నగలు అమ్మజూపాడంటే నమ్మేదెవరు?...ఇప్పుడేం చెప్పినా లాభం లేదు. చెయ్యని నేరాన్ని అంగీకరించడమే మంచిదనిపిస్తోంది.

**మల** : చెప్పండి...ఈ లేఖా, ఈ ఆభరణం, ఈ ముద్రా – ఇవన్నీ ఏమిటి?

**రాక్ష** : అన్నీ విధి విలసతం –

**మల** : విధి విలసితమా? దుర్బుద్ధి విలసనమా?....ఇంకా ఎందుకు కప్పిపుచ్చుకోవాలని చూస్తావ్? నువ్వే మాకు దిక్కు అని నమ్మిన మమ్మల్ని ఇంతగా మోసం చేశావ్! నువ్వే సర్వస్వం అని నమ్మిన మా తండ్రిని – విషకన్య ప్రయోగంతో హతమార్చావ్!

**రాక్ష** : గోరు చుట్టు మీద రోకటి పోటులా ఈ అభియోగం ఏమిటి? విషకన్యను పర్వతేశ్వరుడి మీదకు పంపడం నాకు నిజంగా తెలియదు....ఇది చాణక్యుని పన్నాగం.

**మల** : మరి ఎవరికి తెలుసో? జీవిసిద్ధికి తెలుసా?

**రాక్ష** : అయ్యో! జీవిసిద్ధికూడా చాణక్యుడి చారుడేనా?

**మల** : (కోపంతో) భాసురకా! రాక్షసమిత్రులయిన కులూటాది రాజులకు మా రాజ్యం కావాలట!...వారిని మా రాజ్యంలోనే సజీవ సమాధి చెయ్యండి...సింధు, పారశీక దేశాధిపతులకు మా కోశమూ, గజబలమూ కావాలిట! వారిని ఏనుగుల చేత తొక్కించండి....ఇది మా ఆజ్ఞ....వెంటనే అమలు కావాలి.......వెళ్ళు –

**భాసు** : చిత్తం, ప్రభూ!.....

(వెడతాడు)

**మల** : (కోపంతో) రాక్షసా! సార్థక నామధేయుడి వైనావు! కాని నేను మాత్రం విశ్వాసఘాతకుణ్ణి కాదు... ఇక్కణ్ణుంచి వెంటనే వెళ్ళిపో – వెళ్ళి చంద్రగుప్తుణ్ణే సేవించు....నువ్వు చంద్రగుప్త చాణక్యులతో కలిసివచ్చినా మిమ్మల్ని సర్వనాశనం చేయగలను...వెళ్ళు – భాగురాయణా? ఆలస్యం దేనికి? విజయ భేరి మోగించమనండి

(వెడతారు)

**రాక్ష** : అయ్యో! మిత్రులైన చిత్రవర్మాది రాజుల మరణం చూస్తూ ఊరుకోవలసిందేనా? రాక్షసుడు శత్రువుల మీద ప్రయోగించిన అస్త్రాలు మిత్రుల్నే ఛేదిస్తాయా?....అన్నింటిలోనూ పరాజయం పాలయినాను....వనవాసానికి పోదామంటే గుండెల్లో పగ బతకనివ్వదు....ఆత్మహత్య పౌరుషకార్యం కాదు....ఆ! ఆప్త మిత్రుడు చందనదాసు నా కోసం ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. అతన్ని రక్షించే ప్రయత్నం చెయ్యాలి....ఆ తరువాత నాకేమయినా ఫరవాలేదు.